www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
బుధవారం 15 మార్చి 2023

ఇంటర్మీడియట్ పరీక్షలకు నిమిషం నిబంధన అమలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో ఇంటర్ పరీక్షలకు విద్యార్థులను గంట ముందు నుండి అనుమతించాలని, నిమిషం నిబంధన అమలులో ఉంటుందని జిల్లా మాధ్యమిక విద్యాధికారి డా.శ్రీధర్ సుమన్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని పలు పరీక్షా కేంద్రాల ముందస్తు ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్ బోర్డు ఆదేశాల మేరకు విద్యార్థులను ప్రతి రోజు 8గంటల నుండే పరీక్షా కేంద్రాల్లో అనుమతించనున్నారని, 9గంటల తర్వాత నిమిషం ఆలస్యమైనా అనుమతించరాదని స్పష్టం చేశారు. పరీక్షల సందర్భంగా జిల్లా స్థాయిలో డీఐఈఓ కార్యాలయంలో కంట్రోల్ రూంను ఏర్పాటు చేశారని, హాల్ టికెట్ తదితర సమస్యలుంటే కంట్రోల్ రూం. నెం 08733-293713కి కాల్ చేసి పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ రామదాసు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు బస్సు సౌకర్యం

నవతెలంగాణ-ఆదిలాబాద్

గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఇంటర్మీడియేట్ వార్షిక పరీక్షలకు హాజరయ్యేందుకు ఆర్‌టీసీ ద్వారా ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పిఎస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 15 నుండి ఏప్రిల్ 4 వరకు ఇంటర్మీడియేట్ పరీక్షలు నిర్వహిస్తున్న సందర్భంలో విద్యార్థులకు పరీక్షా కేంద్రాలకు చేరుకునేందుకు వివిధ ప్రాంతాల నుండి ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడిపేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆదిలాబాదు బస్‌స్టేషన్ నుండి ఉట్నూర్‌కు ఉదయం 7గంటలకు, నేరడిగొండకు ఉదయం 6:30కు, బోథ్‌కు 6:30కు, ఇచ్చోడకు 7:15కు, గుడిహత్నూర్‌కు ఉదయం 7:30కు, తాంసి, తలమడుగుకు 7గంటలకు బస్సు సౌకర్యం ఉందన్నారు. బేలకు ఉదయం 6:45కు, జైనథ్‌కు 7:30కు, ఇంద్రవెల్లికి 7గంటలకు, గాదిగూడ నుండి నార్నూర్‌కు 7:30కు, ఇచ్చోడ నుండి బజార్‌హత్నూర్‌కు 7:15కు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశామని తెలిపారు. విద్యార్థులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకొని పరీక్షా కేంద్రాలకు సకాలంలో చేరుకోవాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ఇంటర్ పరీక్షలకు వేళాయె..!

- నేటి ఉదయం 9గంటల నుంచి ప్రారంభం
- నిమిషం ఆలస్యమైనా లోనికి అనుమతి లేదు
- కేంద్రాలకు త్వరగా చేరుకోవాలని అధికారుల సూచన



ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో సిద్ధమైన పరీక్షా కేంద్రం

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, ఆదిలాబాద్‌టౌన్

విద్యార్థులకు మలిమెట్టుగా భావించే ఇంటర్మీయట్ వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా బుధవారం ఉదయం 9గంటల నుంచి మొదలు కానున్నాయి. విద్యార్థులు సమయానికి నిమిషం ఆలస్యమైనా కేంద్రంలోనికి అనుమతించేది లేదని అధికారులు స్పష్టం చేస్తున్నారు. మరోపక్క పరీక్షల నిర్వహణకు అవసరమైన కేంద్రాలు, అధికారులు, సిబ్బంది నియామకాన్ని పూర్తి చేశారు. మరోపక్క విద్యార్థులు ఆయా ప్రాంతాల నుంచి పరీక్ష కేంద్రాలకు చేరేలా సమయానికి బస్సులు నడిపించేలా ఆర్టీసీ అధికారులు చర్యలు చేపట్టారు. ఇప్పటికే జిల్లావ్యాప్తంగా ఆయా ప్రాంతాల నుంచి బస్సులు బయలుదేరు సమయం కూడా విడుదల చేశారు. మాస్ కాపీయింగ్ జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు చెబుతున్నారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటుచేస్తున్నారు.

జిల్లాలో 59,617 మంది విద్యార్థులు

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 59,617మంది విద్యార్థులు ఇంటర్ పరీక్షలు రాయనున్నారు. ఆదిలాబాద్ జిల్లాలో 30 పరీక్ష కేంద్రాలు ఏర్పాటుచేయగా 19,815మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఇందులో ప్రథమ సంవత్సరం విద్యార్థులు 10,022మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 9364మందితో పాటు 429మంది బ్యాక్‌లాగ్ విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 20 పరీక్షలు కేంద్రాలు ఏర్పాటుచేయగా 9933మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇందులో ప్రథమ సంవత్సరం విద్యార్థులు 5135మంది, ద్వితీయ సంవత్సరం 4696మందితో పాటు 102మంది బ్యాక్‌లాగ్ విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. నిర్మల్ జిల్లాలో 23 పరీక్ష కేంద్రాలు ఏర్పాటుచేయగా వీటి పరిధిలో 15,201మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. ఇందులో ప్రథమ సంవత్సరం విద్యార్థులు 7540మంది రాయగా ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 7661మంది పరీక్షలకు హాజరుకానున్నారు. మంచిర్యాల జిల్లాలో 24 పరీక్ష కేంద్రాలు ఏర్పాటుచేయగా 14,668మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.ఇందులో ప్రథమ సంవత్సరం విద్యార్థులు 6910మంది, ద్వితీయ సంవత్సరం 7758మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

నిమిషం నిబంధన..!

ఇంటర్ పరీక్షలు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నిర్వహిస్తారు. ఉదయం 9గంటల కంటే ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రంలోనికి అనుమతించేదిలేదని అధికారులు చెబుతున్నారు. విద్యార్థులు గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచిస్తున్నారు. మరోపక్క పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు హైపవర్ కమిటీతో పాటు జిల్లా పరీక్షల కమిటీ, ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలతో పర్యవేక్షించనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశాం : రవీందర్‌కుమార్, డీఐఈఓ, ఆదిలాబాద్



ఇంటర్ పరీక్షల నిర్వహణకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాం. మాస్ కాపీయింగ్ నిరోధానికి ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను కూడా నియమించాం. విద్యార్థులు నిమిషం ఆలస్యమైన పరీక్ష కేంద్రంలోనికి అనుమతించేది లేదు. గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకుంటే బాగుంటుంది. విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాసేలా ఏర్పాట్లు చేశాం.

పనితీరును ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఆత్మీయ సమ్మేళనాలు

- నిజామాబాద్ ఎమ్మెల్సీ గంగాధర్



నవతెలంగాణ- ఆదిలాబాద్ అర్బన్

ప్రజా సంక్షేమాన్ని కాంక్షిస్తూ దేశంలో ఎక్కడాలేని విధంగా అనేక పథకాలను అమలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ పనితీరును ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తున్నట్లు నిజామాబాద్ ఎమ్మెల్సీ గంగాధర్ అన్నారు. మంగళవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి వచ్చిన ఆయన స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే జోగు రామన్నతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందుతున్న తీరును క్షేత్రస్థాయిలో వివరించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. పార్టీ అధిష్టానం సూచన మేరకు బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనాలను నిర్వహిస్తుందని తెలిపారు. పది గ్రామాలు, నాలుగు వార్డుల చొప్పున కార్యాచరణ రూపొందించి అందజేయాలని స్థానిక నాయకులకు సూచించారు. ఈ సమ్మేళనాల్లో ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, కార్యక్రమాల గురించి వివరించనున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 24వ తేదీలోపు సమావేశాలు పూర్తిచేస్తామని చెప్పారు. ఏప్రిల్ 14న అంబేడ్కర్ జయంతి వేడుకలను సైతం అట్టహాసంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. అదే రోజున హైదరాబాదులో 125అడుగుల భారీ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఏప్రిల్ 25న గ్రామ గ్రామాన జెండా ఆవిష్కరణ జరిపి నియోజకవర్గ సమావేశాలు జరపనున్నామని, 27 న భారీ ఎత్తున బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్వహిస్తామన్నారు. జూన్ లో నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో పార్టీ విద్యార్థి విభాగం పటిష్టతకు సభ్యత్వ నమోదు కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. పార్టీ శ్రేణులు, అభిమానులు ఈ కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ చైర్మన్ రాథోడ్ జనార్దన్, డీసీసీబీ చైర్మన్ అడ్డి బోజారెడ్డి, గ్రంథాలయ చైర్మన్ రావుత్ మనోహర్, మాజీ ఎంపీ గోడం నగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏప్రిల్ 5న భవన నిర్మాణ కార్మికుల చలో ఢిల్లీ

- సంఘం జిల్లా అధ్యక్షుడు బాలకిషన్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, వెల్ఫేర్ బోర్డు నిధులు దారి మళ్లించకుండా నిరోధించాలని డిమాండ్‌తో ఏప్రిల్ 5న నిర్వహించ తలపెట్టిన చలో ఢిల్లీ విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బాలకిషన్ కోరారు. శుక్రవారం సిఐటియు జిల్లా అధ్యక్షుడు అల్లూరి లోకేష్‌తో కలిసి సంఘ భవనంలో విలేకరులతో మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డు నిధులను బిఆర్ఎస్ ప్రభుత్వం దారి మళ్లిస్తుందన్నారు. ఈ నిధుల కోసం కార్మికులంతా ఐక్యంగా పోరాటం చేయాలని కోరారు. దారి మళ్లించిన నిధులు తిరిగి వేల్ఫర్ బోర్డులో జమ చేయాలన్నారు. పెండింగులో ఉన్న క్లైములను వెంటనే ఇవ్వాలని, 60 సంవత్సరాలు పైబడిన కార్మికులకు పెన్షన్ రూ.5వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రమాదవశాత్తు మరణిస్తున్న కార్మికులకు నష్టపరిహారం ఆరు నుండి పది లక్షల పెంచాలని డిమాండ్ చేశారు. కార్మికులతో కూడిన వెల్ఫేర్ బోర్డు అడ్వైజర్ కమిటీ నియమించాలన్నారు. కేంద్ర చట్టంలో ఉన్న విధంగా కార్మికులకు స్కాలర్‌షిప్, గృహవసతి, అడ్డాలలో మౌలిక వసతులు ఇతర సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ శ్రమ్ గుర్తింపు కార్డులను ప్రతి ఒక్క కార్మికుని అందజేయాలన్నారు. డిమాండ్ల పరిష్కారం కోసం కార్మికులంతా ఐక్యం కావాలన్నారు. దీనికోసం నిర్వహించ తలపెట్టిన చలో ఢిల్లీకి కార్మికులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షులు కమలాకర్, సంఘం జిల్లా కోశాధికారి ఆనందరావు, ఆసిఫాబాద్ మండల ప్రధాన కార్యదర్శి ధర్మయి రవి, ఉపాధ్యక్షులు రాంచందర్, కోశాధికారి సదయ్య, ఉపాధ్యక్షులు శంకర్, మండల నాయకులు నరసయ్య, మురళి, తిరుపతి పాల్గొన్నారు.

వాహనాలు జాగ్రత్తగా నడపాలి

- కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్



నవతెలంగాణ - సిర్పూర్(టి)

రోడ్డు నియమాలు పాటిస్తూ వాహనాలను జాగ్రత్తగా నడపాలని కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ అన్నారు. మంగళవారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో పోలీసులు మీకోసం కార్యక్రమంలో భాగంగా ఆటో డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం 35 ఏండ్ల సీనియార్టి గల ముగ్గురు డ్రైవర్లను శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో వివిధ గ్రామాలకు సంబంధించిన 7పాయింట్ల ద్వారా ఆటోలు వెళ్తాయని, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని తెలిపారు. మహిళలను ముందు సీటులో కూర్చోబెట్టకూడదని, పాఠశాల పిల్లలను తీసుకెళ్లే క్రమంలో జాగ్రత్తగా ఆటో నడపాలన్నారు. లైసెన్సులు లేనివారికి సంబంధిత రవాణా శాఖతో మాట్లాడి లైసెన్సులు వచ్చే విధంగా చూస్తానని హామీ ఇచ్చారు. ఆటోలు నడిపే క్రమంలో మద్యం తాగొద్దని, రోడ్డు నియమాలు పాటిస్తూ తమతో ఉన్న ప్రయాణికులను సురక్షితంగా గమ్యాలకు చేర్చాలన్నారు. వెళ్లే క్రమంలో గ్రామాల్లో అవాంఛనీయ సంఘటనలు జరిగిన వెంటనే పోలీస్ శాఖకు సమాచారం అందించాలని, ప్రయాణికులు ఆటోలో విలువైన వస్తువులు మరిచిపోతే వారికి అప్పగించాలని పేర్కొన్నారు. అనంతరం ఎస్ఐ దీకొండ రమేష్ మాట్లాడుతూ ప్రతి ఆటో డ్రైవర్ తప్పనిసరిగా యూనిఫామ్ వేసుకోవాలని, తమ ఆటోలకు క్రమసంఖ్య నెంబర్లు వేసుకోవాలని అన్నారు.

వడదెబ్బతో మేకల కాపరి మృతి



రెబ్బెన : మండలంలోని పులికుంట గ్రామానికి చెందిన మేకల కాపరి బుర్స కొండయ్య(42) వడదెబ్బతో మృతి చెందాడు. ఎప్పటిలాగే మంగళవారం మేకలను మేపేందుకు అడవికి వెళ్లాడు. మధ్యాహ్నం తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో వడదెబ్బ తగిలి మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన పెంచాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

క్షయ వ్యాధిపై ప్రజల్లో క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ సాధన అన్నారు. మంగళవారం కేఆర్‌కే కాలనీలోని బస్తి దవాఖానాలో క్షయ రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ డీఎంహెచ్ఓ సాధన, క్షయ వ్యాధి నిర్మూలన అధికారి శ్రీకాంత్, డాక్టర్లు రాహుల్, శ్రీనివాస్‌లు హాజరయ్యారు. కాగా బీఆర్ఎస్ నాయకులు బొడకుంట రాజు, మాజీ ఎంపీటీసీ సంతోష్‌లు తమవంతుగా చేరో ఇద్దరు టీబీ వ్యాధి రోగులను దత్తత తీసుకుంటామని ప్రకటించారు. వారిని వైద్యులు అభినందించారు. ప్రతి ఒక్కరూ ఇలా ముందుకు వస్తే టీబీ నిర్మూలన సాధ్యమవుతుందని అన్నారు. క్షయ రోగులు తప్పనిసరి మందులు వాడాలని, ఈ వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ పాటు పడాలని సూచించారు. కార్యక్రమంలో 7వ వార్డు కౌన్సిలర్ అంజుబాయి, ఏఎన్ఎం శకుంతల, ఆశ వర్కర్లు, ప్రమీల, అనితా, పార్వతి, అనితా, కాలనీ వాసులు, నాయకులు ఆశన్న, రేఖా, ఆకాష్ పాల్గొన్నారు.

డా.వేణుగోపాలకృష్ణకు ఘన సన్మానం



నవతెలంగాణ-నిర్మల్

జిల్లా ప్రధాన ఆస్పత్రిలో ఆర్ఎంఓగా విధులు నిర్వహిస్తున్న డా.వేణుగోపాలకృష్ణను ఆయన అందిస్తున్న ఉన్నత సేవలకు ఎస్‌యూఆర్‌ఈ సంస్థ, ఎన్‌జీఓ కార్యకర్తలు జిల్లా కేంద్రంలో మంగళవారం శాలువా, పూలమాలలతో సత్కరించారు. ఆయన సేవాలను కొనియాడారు. కార్యక్రమంలో నిర్వాహకులు మల్లికార్జున్, రాజేశ్వర్, బోజన్న, యోగేష్, సిద్ధార్థలు పాల్గొన్నారు.

తాగుడుకు బానిసై వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ - సిర్పూర్(టి)



సిర్పూర్ గ్రామంలోని గోవింద్‌పూర్ కాలనీకి చెందిన ఒడ్డేటి తిరుపతి(32) తాగుడుకు బానిసై పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్టు ఎస్ఐ దీకొండ రమేష్ తెలిపారు. మంగళవారం పోలీసులు, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 8న భార్యాభర్తల మధ్య గొడవ జరగగా భర్త తిరుపతి పొలానికి వెళ్తానని చెప్పి పురుగులమందు తాగి పొలం నుండి ఇంటికి వస్తున్న క్రమంలో వాంతులు చేసుకున్నాడు. గమనించిన స్థానికులకు పురుగుల మందు తాగానని చెప్పాడు. వెంటనే కుటుంబసభ్యులకు సమాచారం అందించగా హుటాహుటిన సిర్పూర్ ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి పరిస్థితి విషమంగా ఉందని మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి రెఫర్ చేశారు. మంచిర్యాల ఆస్పత్రిలో చికిత్స అందించగా ఆరోగ్యం కొంతమేర మెరుగుపడడంతో ఈ 12న ఇంటికి తీసుకొచ్చారు. తిరిగి చికిత్స కోసం 13న మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా తిరుపతిని పరీక్షించిన వైద్యులు కరీంనగర్ చెల్మెల ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. తండ్రి నాగులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ పేర్కొన్నారు.

ప్రవేశ పరీక్ష గడువు 16వరకు పొడిగింపు

నవతెలంగాణ - సిర్పూర్(టి)

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయంలో ఐదో తరగతి ప్రవేశ పరీక్ష కోసం దరఖాస్తు తేదీని ఈ నెల 16 వరకు పొడగించినట్టు డీసీఓ పోలోజు బాలరాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ప్రజలకు మంచి సేవలందించాలి



నవతెలంగాణ-జన్నారం

ప్రజలకు మంచి సేవలు అందించేలా కృషి చేయాలని పోన్కల్ గ్రామ ఉపసర్పంచ్ బి. శ్రీనివాస్‌గౌడ్ సూచించారు. పోన్కల్ గ్రామ నూతన ఈవో రాహుల్‌ను ఆ గ్రామ వార్డు సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. గ్రామాభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు గంగన్న, యాదవ్, కడారుల నర్సయ్య, కోఆప్షన్ సభ్యులు రాగుల శంకర్, నాయకులు జాజాల శ్రీకాంత్, దుమల్ల రమేష్ పాల్గొన్నారు.

20న సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ - సిర్పూర్(టి)

సిర్పూర్ మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 20న నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ రాజేశ్వర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 11.30 గంటలకు సమావేశం ఉంటుందని, సంబంధిత శాఖల అధికారులు గతంలో చేసిన తీర్మానాలకు సంబంధించిన పత్రాలను కార్యాలయంలో అందించాలని తెలిపారు. సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

బీఆర్ఎస్‌పై బీజేపీ భారీ కుట్ర

- జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి



నవతెలంగాణ - రెబ్బెన

బీఆర్ఎస్ ప్రభుత్వంపై బీజేపీ భారీ కుట్రలు చేస్తోందని జడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి అన్నారు. మండలంలోని గోలేటిలో టీబీజీకేయస్ ఆధ్వర్యంలో మంగళవారం ఎంఎల్‌సీ కల్వకుంట్ల కవిత జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. సీఎం కేసీఆర్ తెలంగాణ రాష్ట్రంలో చేస్తున్న అభివృద్ధిని కేంద్ర ప్రభుత్వం ఓర్వలేకనే ఎంఎల్‌సీ కవితపై ఈడీ, ఐటీ దాడులు చేస్తున్నారని విమర్శించారు. సీఎం కేసీఆర్‌ను నేరుగా ఎదుర్కొనే దమ్మూ, ధైర్యం బీజేపీ ప్రభుత్వానికి లేదని విమర్శించారు. బీఆర్ఎస్ నాయకులను నేరుగా ఎదుర్కోలేక ఐటీ, ఈడీ దాడులు చేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికే ఎల్ఐసీని ప్రయివేటీపరులకు అప్పగించారు. అదేవిధంగా సింగరేణిని కూడా ప్రయివేటీకరణ చేయాలనే ఉద్దేశంతో బీజేపీ కుట్రపూరిత నిర్ణయాలను తీసుకుంటోందని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. కుదిరితే జోడీ లేకుంటే ఈడీ దాడులు చేస్తున్నారని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో టీబీజీకేఎస్, బీఆర్ఎస్ ఘన విజయం సాధిస్తుందన్నారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌రావు, సెంట్రల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రకాష్‌రావు, 11 మేన్ కమిటీ సభ్యుడు మంగీలాల్, గోలేటి గ్రామ సర్పంచ్ పోటు సుమలత శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

క్షయవ్యాధిని నిర్మూలించాలని ర్యాలీ



నవతెలంగాణ - బెజ్జూర్

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ సుంకన్న ఆధ్వర్యంలో క్షయవ్యాధిని నిర్మూలించాలని మంగళవారం ఆశ్రమ పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి బస్టాండ్ వరకు సాగింది. ఈ సందర్భంగా జెడ్పీటీసీ పుష్పలత మాట్లాడుతూ క్షయ వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. క్షయ వ్యాధికి సంబంధించిన మందులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందుబాటులో ఉన్నాయని, వ్యాధిగ్రస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ శారద, హెల్త్ సూపర్‌వైజర్ రేణుక, గ్రామ కార్యదర్శి తుకారాం, ల్యాబ్ టెక్నీషియన్ దిలీప్‌కుమార్, వైద్య సిబ్బంది, బీఆర్ఎస్ నాయకులు జావిద్ అలీ, ఆశ్రమ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

పిప్రిలో హెల్త్ మేళా



నవతెలంగాణ - బజార్‌హత్నూర్

పిప్రి గ్రామ ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రంలో మంగళవారం హెల్త్ మేళాను నిర్వహించారు. ఇందులో భాగంగా టీబీ వ్యాధిపై అవగాహన కల్పించి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆనంతరం రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సబ్ సెంటర్ వైద్యులు పండుగ ప్రశాంత్ మాట్లాడుతూ ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరు శ్రద్ధ వహించాలని, వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం సంగీత, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సాండ్‌గాంలో కంటి వెలుగు ప్రారంభం



నవతెలంగాణ - కౌటాల

మండలంలోని సాండ్‌గాం గ్రామ పంచాయతీలో కంటి వెలుగు శిబిరాన్ని ఎంపీపీ బసార్కర్ విశ్వనాథ్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఉచిత కంటి వెలుగు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని గ్రామస్తులకు సూచించారు. ఉచితంగానే పరీక్షలు నిర్వహించి అద్దాలు సైతం అందజేయడం జరుగుతుందని, ఆపరేషన్ అవసరమున్న వారికి ప్రభుత్వమే ఆపరేషన్ చేయిస్తుందని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎకోన్‌కార్ దామోదర్, వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

శనగ కొనుగోళ్లు తాత్కాలికంగా వాయిదా

తాంసి : వాతావరణ శాఖ సూచన ఆధారంగా, తాంసి వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో చేపడుతున్న శనగల కొనుగోళ్లను తేదీ 16 మార్చి నుంచి 19 మార్చి వరకు తాత్కాలికంగా కొనుగోలు నిలిపి వేయాలని నిర్ణయించటం జరిగిందని మండల వ్యవసాయాధికారి రవీందర్ ఒక ప్రకటనలో తెలిపారు. షెడ్యూలు ప్రకారం ఈ తేదీలలో కొనుగోళ్లు జరుగాల్సిన గ్రామాల రైతులు అదే వరుస క్రమంలో తేదీ 20 మార్చి నుండి తాంసి సబ్ మార్కెట్ యార్డులో తమ శనగ పంటను అమ్ముకోవచ్చునని తెలిపారు. తాంసి, భీంపూర్ మండల రైతులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

www.navatelangana.com
నవతెలంగాణ
ఆదిలాబాద్, నిర్మల్
బుధవారం 15 మార్చి 2023

తహసీల్దార్‌కు ఘన సన్మానం

నవతెలంగాణ-నార్నూర్



మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ ఆర్కా మోతీరాంను వైస్ ఎంపీపీ చంద్రశేఖర్, తుడుందెబ్బ జిల్లా నాయకులు కనక ప్రభాకర్ మంగళవారం శాలువాతో సన్మానించారు. రెవెన్యూ శాఖ పరంగా గిరిజనులు గిరిజనేతరులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. సన్మాన కార్యక్రమంలో దళిత సంఘ నాయకుడు దూత్రాజ్ మధుకర్, తుడుం దెబ్బ జిల్లా కార్యదర్శి మెస్రం మాణిక్ రావు ఉన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

నవతెలంగాణ-సారంగాపూర్

గ్రామాల అభివృద్ధే తెలంగాణ ప్రభుత్వ ధ్యేయమని ఎంపీపీ మహిపాల్ రెడ్డి, జెడ్పీటీసీ రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని దుప్యాతండా గ్రామంలో రూ.10 లక్షల నిధులతో సీసీరోడ్డు పనులను ప్రారంభించి మాట్లాడారు. గ్రామాల అభివృద్ధికి సీఎం కేసీఆర్, స్థానిక మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డిలు ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. గ్రామాల్లో చెత్త సేకరణ కోసం ట్రాక్టర్లు, పల్లె ప్రకృతి వనం, క్రీడా మైదానాలు, వైకుంఠదామలు వంటి అనేక అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జాదవ్ ప్రహ్లాద్, ఎంపీడీఓ సరోజ, పంచాయతీ కార్యదర్శి గీతారాణి, ఎంపీటీసీ ఎస్. వెంకట రమణారెడ్డి, పంచాయతీ వార్డు సభ్యులు సిబ్బంది పాల్గొన్నారు.



నర్సరీపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



నవతెలంగాణ-నార్నూర్

గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీలపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ కావల రమేష్ సూచించారు. మంగళవారం మండలంలోని ఖంపూర్, బాబేఝరి, మాన్కాపూర్ గ్రామ పంచాయతీలో నిర్మించిన నర్సరీని సందర్శించారు. నర్సరీలో నాటిన మొక్కలను పరిశీలించారు. ఎండకు మొక్కలు ఎండిపోకుండా రోజు క్రమం తప్పకుండా నీరు పోయాలని నర్సరీలో నిర్లక్ష్యం వహించవద్దని నిర్వాహకులను అదేశించారు. రోడ్డుకు ఇరువైపుల నాటిన మొక్కలకు నీరు పోశారు. నాటిన మొక్కకు కంచెలు ఏర్పాటు చేసి రక్షించాలన్నారు. అదేవిధంగా ఖంపూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించి, మన ఊరు మన బడిలో ఈజీఎస్ కింద చేపట్టిన మరుగుదొడ్లు, వంటగది పనులను పరిశీలించారు. వారి వెంట ఏపీఓ సురేందర్, సర్పంచ్ సలాం ఆనంద్ రావ్, ఎంపీటీసీ ఎత్మ బాయి, టీఏ వికాస్, కార్యదర్శులు కాశీరాం, లవ కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.

ఇంటర్ పరీక్షలకు సన్నద్ధం



నవతెలంగాణ-దిలావర్‌పూర్

మండల కేంద్రంలోని దిలావర్‌పూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం నుండి జరుగబోయే ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు ఏర్పాట్లు సన్నద్ధం చేశామని చీఫ్ సూపరింటెండెంట్ కందూరి శంకర్, ఆ శాఖాధికారి శ్రీకాంత్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ పరీక్షా కేంద్రంలో ప్రథమ సంవత్సరం జనరల్ విభాగంలో సెకండ్ లాంగ్వేజ్ తెలుగు, హిందీ 264 మంది విద్యార్థులకు, వోకేషనల్ విభాగంలో జనరల్ ఫౌండేషన్ కోర్సు పరీక్షకు 35 మంది విద్యార్థులకు పరీక్ష కేంద్రంలో ఏర్పాట్లు చేశామని తెలిపారు. పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు తలెత్తకుండా అన్ని రకాల సౌకర్యాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులు సమయపాలన పాటిస్తూ సరైన సమయంలో పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని పేర్కొన్నారు.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు



నవతెలంగాణ-బజార్‌హత్నూర్

రైతులు ఆధునిక పద్ధతిలో ఆరుతడి పంటలు సాగు చేయడం ద్వారా స్వల్పకాల వ్యవధిలో అధిక దిగుబడులు పొందవచ్చునని జిల్లా వ్యవసాయ అధికారి డి.పుల్లయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు అందుగూడ, జాతర్ల, పిప్పిరి తదితర గ్రామాల్లోని రబీ జొన్న, మొక్కజొన్న పంటలను పరిశీలించి, పలు సూచనలు అందించారు. ఈ సంద్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పంట భీమా సౌకర్యాన్ని ఉపయోగించుకోవాలని అన్నారు. వాతావరణ అనుకూలతతో పంట నష్టపోయిన రైతులకు భీమా సౌకర్యం ద్వారా నష్టపరిహారం చెల్లించడం జరుగుతుందని తెలిపారు. వ్యవసాయ యాంత్రికరణ పద్ధతిని ఉపయోగించి పంటలను సాగు చేయడం ద్వారా తక్కువ ఖర్చుతో ఎక్కువ పంట దిగుబడి లభిస్తుందని రైతులు తెలిపారు. విత్తనశుద్ధి, సేంద్రియ ఎరువుల వాడకం, క్రిమిసంహారక మందులపై అవగాహన కల్పించారు. అనంతరం రైతు వేదిలకను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ప్రమోద్‌రెడ్డి, వ్యసాయ విస్తరణ అధికారులు సంతోష్, రామ్, సంజీవ్, రైతులు సుది వినాయక్, చట్ల ఉత్తం, ఇందల్ సింగ్ పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాలను పరిశీలించిన డీఐఈఓ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాలను డీఐఈఓ రవీందర్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పరీక్ష కేంద్రాలలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన సదుపాయాలను, కళాశాల సిబ్బందిని అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. ఎండాకాలం దృష్టిలో ఉంచుకొని పరీక్షలకు వచ్చే విద్యార్థులకు తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఆయన వెంట కళాశాల సిబ్బంది ఉన్నారు.

పట్టణ మాదిగ సంక్షేమ సంఘం ఎన్నిక



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

మాదిగ సంక్షేమ సంఘం పట్టణ కమిటీని మంగళవారం ఆ సంఘం జిల్లా అధ్యక్షులు చందాల రాజన్న సమక్షంలో ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా అలాల అజయ్, అధ్యక్షులుగా ఇజ్జగిరి సంజయ్, ప్రధాన కార్యదర్శిగా ఈర్ల దయాకర్, పట్టణ ఉపాధ్యక్షులుగా నలగంటి నవీన్ కుమార్, దర్శనాల నగేష్, జాయింట్ సెక్రటరీగా అన్నెల వసంత్, కోశాధికారి, మీడియా ఇన్‌చార్జీగా రొడ్డ సాగర్, సలహాదారులుగా కడదరపు అశోక్, దర్శనాల లక్ష్మణ్, కొత్తూరి ప్రసన్న, దర్శనాల ఏవన్ ఎన్నికయ్యారు. వీరికి పలువురు దళిత సంఘాల నాయకులు అభినందనలు తెలిపారు.

పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్



నవతెలంగాణ-నిర్మల్

గ్రామపంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ అన్నారు. తెలంగాణ గ్రామ పంచాయతి వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. డీఆర్వో లోకేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కార్మికులకు నవంబర్, డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి వేతనాలను వెంటనే చెల్లించాలని అన్నారు. వేతనాలు లేకుండా కార్మికులు ఎలా బ్రతకాలని ప్రశ్నించారు. సీఎం, మంత్రులు, అధికారులు ప్రతి నెల ఒకటో తేదీ లోపు వేతనం తీసుకుంటారని అన్నారు. కానీ పేదలైన గ్రామపంచాయతీ కార్మికులకు ఐదు నుండి ఆరు నెలల వేతనం ఇవ్వకుండా, నిర్లక్ష్యం వహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ మొండి వైఖరి విడనాడాలని అన్నారు. ఖానాపూర్ మండలంలో ఇక్బాల్‌పూర్ గ్రామంలో రమేష్ కార్మికునికి 18 నెలల నుంచి వేతనం ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఇప్పటివరకు పీఆర్సీ ఇవ్వలేదని, ఇన్సూరెన్స్ కల్పిస్తామని చెప్పి ఇవ్వలేదని అన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇల్లు, దళితబంధు ఇవ్వాలేదని అన్నారు. వెంటనే పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని అన్నారు. లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు నర్సయ్య, ఉపాధ్యక్షులు పోశెట్టి, జిల్లా సహాయ కార్యదర్శి రాములు, నాగరాజు, స్వామి, బద్రి, బోరవ్వ, రాజవ్వ, అఫ్జల్, పోశెట్టి, కార్మికులు పాల్గొన్నారు.

సంఘ భవనానికి భూమిపూజ



నవతెలంగాణ-నిర్మల్

జిల్లా కేంద్రంలోని 36వ వార్డు బుధవార్‌పేట్‌లో రూ.20 లక్షలతో నూతనంగా నిర్మించనున్న ఎస్సీ కమ్యూనిటీ సంఘ భవనానికి మంగళవారం మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్‌కు సముచిత స్థానం ఇచ్చి గౌరవిస్తుందని అన్నారు. సీఎం కేసీఆర్ నూతన సచివాలయానికి అంబేద్కర్ పేరు పెట్టారని అన్నారు. ఏప్రిల్ 14న హైదరాబాద్ ట్యాంక్ బండ్ వద్ద 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తోందని అన్నారు. ప్రారంభోత్సవానికి నిర్మల్ నుంచి అందరూ రావాలని అన్నారు. నిర్మల్ నియోజక వర్గం దళితులకు దళితబంధు పథకం వర్తింపజేస్తున్నట్లు తెలిపారు. వార్డులో పోచమ్మ ఆలయానికి నిధులు మంజూరు చేశామని అన్నారు. బుధవార్ పేట్‌లో శివకోటి ఆలయం, పట్టణంలో ప్రతీ ఒక్క ఆలయాన్ని అభివృద్ధి చేశామని అన్నారు. ఎస్సీ సంఘ భవనానికి మొదట రూ.10 లక్షలు మంజూరు చేశామని, వార్డు నాయకుల కోరిక మేరకు రూ.20 లక్షలతో భవనాన్ని నిర్మిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్, ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మెన్ ధర్మజి రాజేందర్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు మారుగొండ రాము, మాజీ జిల్లా పరిషత్ చైర్మెన్ లోలం శ్యామ్ సుందర్, ఏఎంసీ వైస్ చైర్మెన్ శ్రీకాంత్ యాదవ్, కౌన్సిలర్ పోశెట్టి, వార్డు నాయకులు కత్తి సుధాకర్, దేవర రఘు, కాలనీవాసులు పాల్గొన్నారు.

అనర్హులను లిస్టు నుంచి తొలగించే వరకు పోరాటం

- పేదలతో కలిసి నిరసన చేపట్టిన అఖిలపక్షం
- కలెక్టర్ స్పందించి కంప్లైంట్ బాక్స్ ఏర్పాటు చేయడం అభినందనీయం

నవతెలంగాణ-ఖానాపూర్

డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరైన వాటి నుండి అనర్హులను లిస్టు నుంచి తొలగించే వరకు పోరాటం ఆగదని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి నందిరామయ్య, బీజేపీ పట్టణ అధ్యక్షులు నాయిని సంతోష్ అన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట పేదలతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖానాపూర్ మున్సిపాలిటీ పరిధిలో డబుల్ బెడ్ రూమ్ లక్కీడ్రాలో ఇండ్లు రాక వందలాది మంది పేదలకు అన్యాయం జరిగిందనీ అన్నారు. ఈ విషయంపై స్పందించిన కలెక్టర్ కంప్లైంట్ బాక్స్ ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. కంప్లైంట్‌ను దృష్టిలో పెట్టుకొని వార్డుల వారిగా జిల్లా అధికారిచే క్షేత్రస్థాయి సర్వే నిర్వహించి, అనర్హులను వెంటనే తొలగించాలని కోరారు. అలాగే లక్కీడ్రాలో ఇల్లు పొందిన వారి నుండి ఆస్తిపాస్తులకు సంబంధించిన అఫిడవిట్‌ను తీసుకోవాలని దాని ఆధారంగా సర్వే నిర్వహించాలని అన్నారు. మున్సిపాలిటీ, సబ్ రిజిస్టర్, మండల తహసీల్దార్ కార్యాలయం ఈ మూడు శాఖల నుంచి వివరాలు సేకరించి ఇండ్లు ఉన్నవారి లిస్టును బయటపెట్టి అనర్హులను తొలగించాలని అన్నారు. లేనియెడల ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు.



బీఆర్ఎస్ ప్రజలకు మరింత చేరువయ్యేలా కార్యక్రమాలు

- నిర్మల్ జిల్లా బీఆర్ఎస్ ఇన్‌చార్జి గంగాధర్‌గౌడ్



నవతెలంగాణ-నిర్మల్

బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు బీఆర్ఎస్ ప్రజలకు మరింత చేరువయ్యేలా కార్యక్రమాలను అమలు చేయాలని నిర్మల్ జిల్లా బీఆర్ఎస్ ఇన్‌చార్జీ గంగాధర్‌గౌడ్ పార్టీ శ్రేణులకు సూచించారు. మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, ఎమ్మెల్యేలు విఠల్‌రెడ్డి, రేఖా నాయక్‌తో జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గంగాధర్ గౌడ్ మాట్లాడారు. నాలుగు నెలల పాటు బీఆర్ఎస్ చేపట్టే కార్యక్రమాల రూపకల్పన, వాటి అమలుపై విస్తృతంగా చర్చించారు. భారత రాష్ట్ర సమితి పార్టీకి కార్యకర్తలే బలమని, పార్టీ శ్రేణులు అందర్నీ ఏకం చేసేలా ఆత్మీయ సమ్మేళనాలను ఏర్పాటు చేయాలని అన్నారు. దీనికి సంబంధించి కార్యచరణను రూపొందించాలని సూచించారు. సమావేశాల నిర్వహణను పార్టీ జిల్లా అధ్యక్షులు సమన్వయం చేసుకోవాలని, ప్రతి పది గ్రామాలను యూనిట్‌గా, పట్టణాల్లోని డివిజన్లుగా తీసుకుని స్థానిక ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మెన్లు, డీసీసీబీ, డీసీఎంఎస్, పార్టీ ముఖ్యులను కలుపుకొని ఈ ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించాలని అన్నారు. పార్టీ శ్రేణులు అందరిని ఏకం చేసేలా విస్తృతంగా చేపట్టనున్న ఆత్మీయ సమ్మేళనాలు, డా. బీఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలు, పార్టీ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాలు, నియోజకవర్గ ప్రతినిధుల సభ, బీఆర్ఎస్ విద్యార్థి విభాగం కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టేలా, పార్టీ జిల్లా అధ్యక్షులు ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులతో సమన్వయం చేసుకోవాలని అన్నారు. అనంతరం మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో ప్రతిపక్షాలు చేసే విమర్శలను తిప్పి కొట్టాలని, పార్టీ శ్రేణులకు సూచించారు. తెలంగాణ పట్ల కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ వివక్ష, రాష్ట్ర ప్రభుత్వాలపై కక్ష్యసాధింపులు, నిత్యావసర వస్తువులు, గ్యాస్ ధరలపై పెంపు, ఇతర అంశాలపై బీఆర్ఎస్ పార్టీ ఇచ్చే పిలుపు మేరకు నిరసన కార్యక్రమాల్లో పాల్గొనాలని అన్నారు. గ్రామ గ్రామాన బీజేపీ తీరును ఎండగట్టాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వాడీవేడిగా మండల సర్వసభ్య సమావేశం

- పనుల బిల్లులు ఇవ్వకుండా అభివృద్ధి ఎలా సాధ్యం
- ఎంపీపీకి నాగపూర్ సర్పంచ్‌కు వాగ్వావాదం



నవతెలంగాణ-ఉట్నూర్

గ్రామాల్లో చేసిన పనులకు నెలల తరబడి బిల్లులు ఇవ్వకుండా అభివృద్ధి ఎలా జరుగుతుందని పలువురు సర్పంచ్‌లు అధికారులను నిలదీశారు. మంగళవారం ఎంపీడీఓ సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ పంద్ర జైవంత్ రావు అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో సర్పంచ్‌లు జాదవ్ సునీల్ కేసీఆర్ ప్రభుత్వాన్ని, పార్టీ నాయకులను, అధికారులను నిలదీయడంతో ఎంపీపీ పంద్రా జైవంత్ రావుకు సర్పంచ్‌కు వాగ్వావాదం చోటు చేసుకుంది. గతంలో పంచాయతీ పరిధిలోని చేసిన అభివృద్ధి పనులకు వెంటనే బిల్లులు వచ్చేవని, కేసీఆర్ ప్రభుత్వ ఆయాంలో బిల్లుల కోసం నెలల తరబడి వేచిచూడాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. పంచాయతీ అభివృద్ధికి చేసిన పనులకు తీసుకవచ్చిన అప్పులు ఎలా తిరిచ్చారలోనని సర్పంచులందరూ ఆవేదనలో ఉన్నారని అన్నారు. మండల సర్వసభ్య సమావేశానికి అధికారులు రాకుంటే సమస్యలు ఎవరికి చెప్పాలని సభ్యులు సమావేశంలో ఎంపీపీ దృష్టికి తీసుకెళ్లారు. గ్రామాల్లో ఉపాధి కూలీలకు వర్క్ ఐడిల విషయంలో పాత పద్ధతిలో కొనసాగించాలని అన్నారు. గ్రామాల్లో మీషన్ భగీరథ నీటిని సరఫరా చేయడంలో అధికారులు విఫలమయ్యారని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులకు ఎన్నిసార్లు చెప్పిన పట్టించుకోకవడం లేదని అన్నారు. గ్రామాల్లో పలు సమస్యలను పరిష్కరించాలని కోరారు. సమావేశం ఉందని తెలిసి అధికారులు రాకపోవడం సరికాదని, అధికారుల తీరుమార్చుకోవాలని అన్నారు. సమావేశానికి రాని అధికారులపై తగు చర్యలు తీసుకోవాలని తీర్మాణం చేయాలని ఎంపీడీఓ తిరుమలకు ఎంపీపీ సూచించారు. ఎంపీపీ మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను గ్రామాల్లో అమలు చేయాలన్నారు. అభివృద్ధి కోసం చేపడుతున్న పనులు సకాలంలో పూర్తి చేయాలని అన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు మధ్య సమన్వయంతో గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ రాథోడ్ చారులత, పీఏసీఎస్ చైర్మెన్ ఎస్సీ రెడ్డి, కోఆప్షన్ రషీద్, సభ్యులు ఉన్నారు.

కంటి వెలుగు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-నిర్మల్

అంధత్వ రహిత తెలంగాణ కోసం ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని ప్రజలు ఈ కంటి వెలుగు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని వార్డు నెం 03, రామరావుబాగ్‌లో రెండో విడత కంటి వెలుగు శిబిరాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నిర్మల్ పట్టణంలోని 42 వార్డుల్లో కట్టుదిట్టమైన ప్రణాళికతో ప్రజలందరిని భాగస్వామ్యం చేస్తున్నామని అన్నారు. ప్రభుత్వం కంటి చికిత్సతో పాటు కంటి అద్దాలు, మందులను ఉచితంగా అందిస్తోందని అన్నారు. ప్రజలందరు ఉచిత కంటి వెలుగు ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్మెన్ చిలుక రమణ, స్థానిక కౌన్సిలర్ అడుముళ్ల రమాదేవి పద్మాకర్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మెన్ తోట సురేందర్, మహాలక్ష్మి ఆలయ చైర్మెన్ కే.గంగాధర్, కౌన్సిలర్లు లక్కాకుల నరహరి, బిట్లింగ్ నవీన్, కోఆప్షన్ సభ్యులు చిలుక గోవర్ధన్, తోట నర్సయ్య, జి.రాందాస్, తోట గంగన్న, సంగు బోజన్న, ఇప్ప అడెల్లు, సిద్ధ బాబ్యా, నాందేవ్ పటేల్, వైద్య సిబ్బంది, కాలనీవాసులు పాల్గొన్నారు.

భారత్ జూడో పాదయాత్రను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-బజార్‌హత్నూర్

రాహుల్ గాంధీకి మద్దతుగా గురువారం పిప్పిరి గ్రామం నుండి ఇచ్చోడ మండల కేంద్రం వరకు జరిగే జోడో పాదయాత్రను విజయవంతం చేయాలని జెడ్పీటీసీ మల్లెపూల నర్సయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఎర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈరోజు జరుగుతున్నటువంటి రాహుల్ గాంధీ కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు పాదయాత్ర చేస్తున్న సందర్భంగా వారికి మద్దతుగా గురువారం ఉదయం మండలంలోని పిప్పిరి గ్రామం నుండి ఇచ్చోడ మండల కేంద్రం వరకు పాదయాత్ర చేయడం జరుగుతుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అధిక సంఖ్యలో పాదయాత్రలో పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు జల్కే పాండురంగ్, ఇర్ల శివుడు, బత్తిని కిషన్, కీర్తి రమణ, రాజు, అశోక్, రామకృష్ణ పాల్గొన్నారు.

మైనార్టీ రుణ దరఖాస్తుదారుల ఎంపిక

నవతెలంగాణ-దిలావర్‌పూర్

మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా రుణాల కొరకు వివిధ గ్రామ పంచాయతీల నుంచి దరఖాస్తు చేసుకున్న మైనార్టీ నిరుద్యోగ అభ్యర్థులు మార్చి 16వ తేదీ గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో 11 గంటలకు హాజరుకావాలని ఎంపీడీఓ మోహన్ తెలియజేశారు. బ్యాంకు అధికారుల సమక్షంలో లబ్దిదారులను ఎంపిక చేయనున్నట్టు తెలిపారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో సకాలంలో హాజరు కావాలని బ్యాంక్ అధికారులు తెలిపారు.

తరోడాలో ఆలయ భూమి సర్వే

నవతెలంగాణ-భైంసా

ముథోల్ మండలంలోని తరోడ గ్రామంలో హనుమాన్ ఆలయానికి చెందిన సర్వే నంబర్ 73లో ఉన్న 22గుంటల ఆలయ భూమిని మంగళవారం దేవాదాయ శాఖ అధికారుల వృందం సర్వే నిర్వహించారు. ఆలయ భూమి ఆక్రమణకు గురికావడంతో, కాపాడాలని గత కొన్ని రోజులుగా గ్రామస్తులు జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎట్టకేలకు స్పందించిన దేవాదాయ శాఖ అధికారులు గ్రామంలో ఉన్న ఆలయ భూమిని నిర్మల్ జిల్లా దేవాదాయ శాఖ ఇన్స్‌పెక్టర్ రవికిషన్ గౌడ్ ఆధ్వర్యంలో వరంగల్ జోన్ దేవదాయ శాఖ సర్వేయర్ అనిల్, సిబ్బంది సర్వే నిర్వహించి, హద్దులు ఏర్పటుచేశారు. ఆలయ భూమిని ఆక్రమించుకున్న 15 మందిని గుర్తించినట్టు వారు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు త్వరలో నోటీసులు ఇవ్వనున్నట్లు దేవాదాయ శాఖ ఇన్స్‌పెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా ఎఎస్ఐ సుదర్శన్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ శాఖ ఆర్ఐ అభిమాన్యు సర్పంచ్ శ్వేత రవికిరణ్‌గౌడ్, ఎంపీటీసీ గంగాధర్, గ్రామస్థులు పాల్గొన్నారు.

మహిళలు స్వయం ఉపాధి మార్గాలపై దృష్టి సారించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



మహిళలు స్వయం ఉపాధి మార్గాలపై దృష్టి సారించి, ఆర్థిక ప్రగతి సాధించాలని జిల్లా పరిశ్రమల శాఖ జీఎం పద్మభూషణ్ రాజు సూచించారు. ఈ సందర్భంగా మంగళవారం పట్టణంలోని జెడ్పీ సమావేశ మందిరంలో జన శిక్షణ సంస్థాన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులు పలు అంశాలపై చర్చించారు. అంతకుముందు నిర్వహించిన సాంస్కతిక ప్రదర్శనలు ఆహ్వానితులను విశేషంగా అలరించాయి. ఈ మేరకు జిల్లా పరిశ్రమల శాఖ జీఎం పద్మభూషణ్ రాజు మాట్లాడుతూ మహిళా లేనిదే సృష్టి లేదని అన్నారు. ప్రస్తుతం అనేక మంది తమ అభిరుచులకు తగ్గట్లుగా శిక్షణలు పొందిన తర్వాత వాటిని కొనసాగించడం లేదని అన్నారు. ప్రతి ఒక్క మహిళా తమ కాళ్లపై తాము నిలబడేలా ఆర్థిక స్వేచ్ఛను సాధించాలని సూచించారు. మహిళలు అన్ని రంగాల్లో విశేషంగా రాణిస్తున్నారని, తోటి వారిని ఆదర్శంగా తీసుకుంటూ, ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జన శిక్షణ సంస్థాన్ డైరెక్టర్ శ్యామల, లీడ్ బ్యాంక్ మేనేజర్ ప్రసాద్, ఐటీఐ ప్రిన్సిపాల్ సుజాత, ట్రైనింగ్ ఆఫీసర్ శ్రీనివాస్, జెఎస్ఎస్ ప్రతినిధులు సబియా, సురేందర్, రాజన్న పాల్గొన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-రామకృష్ణాపూర్



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగును వార్డు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ జంగం కళ అన్నారు. మంగళవారం మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణతో కలిసి 10 వార్డులో స్థానిక కౌన్సిలర్ రాజు ఆధ్వర్యంలో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కంటిచూపు సమస్యలు ఉన్నవారు పరీక్షలు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ నాగరాజు, వసంత్, అందుగుల మల్లేష్, రమేష్, సతీష్, రాజేష్ పాల్గొన్నారు.

మెడికల్ షాపులపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-జన్నారం

మెడికల్ షాపుల్లో అడ్డగోలుగా దోపిడి చేస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని పొన్కల్ మేజర్ గ్రామపంచాయతీ ఉప సర్పంచ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు బాలసాని శ్రీనివాస్‌గౌడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని మెడికల్ షాపుల్లో ఎలాంటి రశీదులు ఇవ్వకుండా రోగులను దోచుకుంటున్నారని తెలిపారు. అంతే కాకుండా నకిలి, రద్దుఅయినట్టువంటి మందులు విక్రయిస్తూ రోగుల ప్రాణాలతో చెలగాటం అడుతున్నారని, రశీదులు ఇవ్వక పోవటంతో రోగులకు ఏమైనా జరిగితే సదరు మెడికల్ షాపు యజమాని తప్పించుకునే రోగుల వద్ద ఎలాంటి ఆధారాలు ఉండవని పేర్కొన్నారు. మంలంలోని మెడికల్ షాపులపై డ్రగ్ ఇన్స్‌పెక్టర్ చర్యలు తీసుకోవాలని, ఈ విసయంలో జిల్లా వైద్యాధికారికి ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

ఇంటర్ పరీక్షలకు వసతులు కల్పించాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి



నవతెలంగాణ-మంచిర్యాల

ఇంటర్‌మీడియట్ పరీక్షలు రాసే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు కల్పించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి కోరారు. మంగళవారం డీఐఈఓ శైలజకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి మాట్లాడుతూ ఈ 15 నుంచి ప్రారంభం కానున్న ఇంటర్‌మీడియట్ వార్షిక పరీక్షలు విద్యార్థులకు ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించాలని, త్రాగడానికి నీటి ఇబ్బందులు లేకుండా ఉన్నత అధికారులు వసతులు కల్పించాలని అన్నారు. జిల్లా వ్యాప్తంగా 14668 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్ల తెలిపారు. అధికారులు 24 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారని, ఉదయం నుంచి విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు వెళ్లేందుకు బస్సు సౌకర్యం ప్రత్యేకంగా కల్పించాలని కోరారు. విద్యార్థులు ఎక్కడ కూడా ఇబ్బంది పడకుండా చూసుకోవాలని ఆర్టీసీ ఉన్నత అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో సౌమ్య, అభినయ, శ్వేత పాల్గొన్నారు.

మంత్రి పర్యటనను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-లక్షెట్టిపేట్

పట్టణంలోని పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా హాజరౌతున్న వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు పర్యటనను ప్రజలు, నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలను మున్సిపల్ చైర్మన్ కాంతయ్య, వైస్ చైర్మన్ పోడేటీ శ్రీనివాస్‌గౌడ్‌లు పిలుపునిచ్చారు. మంగళవారం సాయంత్రం పట్టణంలోని విశ్రాంతి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రూ.8 కోట్లతో ప్రభుత్వ ఆస్పత్రికి భూమి పూజ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. లక్షెట్టిపేట్, హాజీపూర్, దండేపల్లి, జన్నారం మండలాల ప్రజలకు వైద్య సేవలు చేరువ కానుందని తెలిపారు. గతంలో ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని ప్రతిపక్ష నాయకులు చేస్తున్న విమర్శలు అర్థరహితమని అన్నారు. ప్రభుత్వం ఈ ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో ఇంటి నిర్మాణానికి రూ.3 లక్షలు కేటాయించినట్లు వివరించారు. అదే విధంగా త్వరలోనే అన్ని హామీలు నెరవేరుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లా స్థాయిలో అందరిని ఆహ్వానించి భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు చైర్మన్ కాంతయ్య తెలిపారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు పాదం శ్రీనివాస్, దండేపల్లి ఎంపీపీ గడ్డం శ్రీనివాస్, నాయకులు గోళ్ల రాయమల్లు, సత్తయ్య పాల్గొన్నారు.

అన్ని దానాల్లోకెల్లా రక్తదానం గొప్పది



నవతెలంగాణ-నస్పూర్

అన్ని దానాల్లోకెల్లా రక్తదానం గొప్పదని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి.సంజీవరెడ్డి అన్నారు. మంగళవారం ఆర్కే-8 డిస్పెన్సరీలో వృత్తి శిక్షణా కేంద్రంలో శిక్షణ తీసుకుంటున్న ఉద్యోగులు, ఫ్రంట్ లైన్ సూపర్‌వైజర్లు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి ముఖ్యఅతిథిగా పాల్గొని రక్తదానం చేసిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలను అందజేసారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ సింగరేణి సంస్థ యువ కిరణాలతో కళకళలాడు తుందని, ఈ రోజు రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికి హృదయ పూర్వక అభినందనలు తెలిపారు. శ్రీరాంపూర్ ఏరియాలో 15 రక్తదాన శిబిరాలు నిర్వహించడం జరిగిందని ఈ రక్తదాన శిబిరాల ద్వారా 629 యూనిట్ల రక్తం రెడ్ క్రాస్ సొసైటీ వారికి అందజేయడం జరిగిందని తెలిపారు. ఇలా సేకరించిన రక్తాన్ని తలసేమియా వ్యాధిగ్రస్థులకు, కిడ్నీ వ్యాధిగ్రస్థులకు, క్యాన్సర్ వ్యాధిగ్రస్థులకు, గర్భిణులకు ప్రభుత్వ హాస్పిటల్‌లోని నిరుపేదలకు ఉచితంగా అందిస్తున్నారని అన్నారు. కంపెనీ ఉత్పత్తితో పాటు సామాజిక సేవలో కూడా ముందుంటుందని తెలిపారు. అలాగే రెడ్ క్రాస్ సొసైటీ వారు చేస్తున్న సేవలను అభినందించారు. కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఏరియా గుర్తింపు సంఘం ఉపాధ్యక్షులు కే.సురేందర్‌రెడ్డి, శ్రీరాంపూర్ ఎంవిటిసి ఎస్ఓఎం కల్లూరి వెంకట రామారావు, డివై సీఎంఓ డాక్టర్ పి.రమేష్ బాబు, డీజీఎం శివ రావు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ లోకనాథ్‌రెడ్డి, ఎంవిటిసి శిక్షకులు రాజ్ కుమార్, కాసర్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

గ్రామ సమస్యల పరిష్కారమే లక్ష్యం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని మార్కెట్ కమిటీ చైర్మన్ ఎంపీటీసీ గాదవేణి మల్లేష్ తెలిపారు. మండలంలోని సాలెగూడ గ్రామంలో సర్పంచ్ వినోద్ అధ్యక్షతన నిర్వహించిన గ్రామ సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని వివిధ కాలనీలో నెలకొన్న సమస్యలను గ్రామ సభ దృష్టికి తీసుకురావాలని ప్రజలకు సూచించారు. గ్రామంలో పచ్చదనం పరిశుభ్రత కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని సూచించారు. గ్రామంలో జరుగుతున్న ప్రతి అభివృద్ధి పనులను గ్రామ సభ ముందు ఉంచుతామని తెలిపారు. సభ్యులకు ప్రజలకు అభ్యంతరాలు ఉంటే తెలపాలని అన్నారు. ప్రజల భాగస్వామ్యంతో పంచాయతీ అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. అనంతరం కొన్ని పనులకు గ్రామసభ ఏకగ్రీవ తీర్మానం చేశారు. అనంతరం స్థానిక అంగన్‌వాడీలో చిన్నారులకు పలకలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రావణ్, పంచాయతీ కార్యదర్శి పద్మ గ్రామ పెద్దలు రుక్మజి, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు జగన్నాథ్ పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్
- పంచాయతీ కార్మికుల ర్యాలీ, డీపీఓకు వినతి



నవతెలంగాణ-మంచిర్యాల

పంచాయతీ శాఖ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులు ర్యాలీ నిర్వహించి జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయం ముందు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామాల్లో పరిశుధ్య పనులు చేస్తున్న గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు రోజు రోజుకీ పెరుగుతున్నాయన్నారు. ఒకవైపు గ్రామాల్లోని ప్రజాప్రతినిధుల వేధింపులు మరోవైపు అధికారుల వేధింపులు తట్టుకోలేక ఇబ్బందుల మధ్య విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రతి నెల జీతాలు రాకపోవడంతో ఆత్మహత్యలు చేసుకుంటున్న



గ్రామపంచాయతీ కార్మికుల పరిస్థితి దారుణంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆత్మహత్యల నివారణకు ప్రతినెల వేతనాలు చెల్లించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మల్టిపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, జీఓ నెంబర్ 51 సవరించాలని అన్నారు. పీఆర్‌సీని వర్తింపచేయాలి స్థానిక ప్రజాప్రతినిధుల వేధింపులు అరికట్టాలని కోరారు. కార్మికుల తొలగింపులను వెంటనే నిలిపివేయాలని, ప్రతి సంవత్సరం కార్మికులకు ఇచ్చే సబ్బులు, నూనె, బెల్లం, బూట్లు, గ్లౌజులు సంవత్సరాలు గడిచిన స్థానిక పంచాయతీ కార్యదర్శులు ఇప్పటివరకు ఇవ్వకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. తపాలా శాఖ కల్పిస్తున్న బీమా సౌకర్యాన్ని వర్తింప చేసేందుకు కలెక్టర్, డీపీఓ చొరవ తీసుకుని ప్రభుత్వమే రూ.399 ప్రీమియాన్ని చెల్లించే విదంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో అవునూరి సాగర్, దుమ్మల సుధాకర్ గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సాయి కృష్ణ జిల్లా కోశధికారి, చిన్నన్న, రాజలింగు జిల్లా ఉపాధ్యక్షుడు రవి, శంకర్, చందు, నర్సయ్య, వెంకటేష్, కుమార్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ నియామకాల్లో అక్రమాలపై ఫిర్యాదు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పట్టణంలో అంగన్‌వాడీ టీచర్ పోస్టుల నియామకంపై మంగళవారం సహ చట్టం కార్యకర్త అజీమ్‌తో పాటు ఇద్దరు కౌన్సిలర్లు లావణ్య శరత్ ముదిరాజ్, ఎండి వలీలు ఆసిఫాబాద్ కలెక్టర్, పీడీ, సీడీపీఓలకు ఫిర్యాదు చేశారు. అంగన్‌వాడీ ఆయాలకు పదోన్నతి కల్పిస్తూ టీచర్లుగా నియమించే ప్రక్రియ పారదర్శకంగా జరగలేదని, స్థానికులను కాదని స్థానికేతరులకు ఉద్యోగాలు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారని ఆరోపిస్తూ రుజువులతో సహా వారు అధికారులకు ఫిర్యాదు చేశారు. స్థానిక 22వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్ పోస్టు ఖాళీగా ఉండడంతో అదే కేంద్రంలో పని చేసే ఆయా సువర్ణ ఈ పోస్టుకు దరఖాస్తు చేసుకుంది. 24వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో పని చేసే ఆయా దుర్గం యోగిత 22వ వార్డులో నివాసం ఉంటుండడంతో 22వ వార్డు అంగన్‌వాడీ కేంద్రం టీచర్ పోస్టుకు ఆమె కూడా దరఖాస్తు చేసుకుంది. వీరిద్దరిని కాదని 23వ వార్డులో నివాసముండే 21వ వార్డుకు చెందిన అంగన్‌వాడీ కేంద్రం ఆయాకు ఇక్కడ టీచర్‌గా పదోన్నతి కల్పిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. అదేవిధంగా స్థానిక 11వ వార్డు ఒడ్డెర బస్తీ అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్ పోస్టు ఖాళీగా ఉండడంతో 17వ వార్డు అంగన్‌వాడీ కేంద్రం ఆయా ఈ పోస్టుకు దరఖాస్తు చేసుకుంది. 11వ వార్డుకు చెందిన మహిళనే ఈ పోస్టుకు ఎంపిక చేయాల్సి ఉండగా, దీనికి విరుద్ధంగా 17వ వార్డు అంగన్‌వాడీ కేంద్రం ఆయాను ఈ పోస్టుకు ఎంపిక చేశారు. తప్పుడు నివాస ధృవీకరణ పత్రంతో ఆయా ఈ పోస్టుకు దరఖాస్తు చేసుకున్నట్లు వీరు ఆధారాలను కలెక్టర్ హేమంత్ బొర్కాడేకు చూపించారు.

దీనికి స్పందించిన కలెక్టర్ వీటిపై సమగ్ర విచారణ చేపట్టి సదరు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పీడీకి ఆదేశాలు జారీ చేసినట్లు సహ చట్టం కార్యకర్త అజీమ్ తెలిపారు.

విత్తనాల కంపెనీపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు



నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని పలు గ్రామాల రైతులు సింధు విత్తనాల కంపెనీని నమ్మి తీవ్రంగా నష్టపోయామని ఆ కంపెనీపై పలువురు మధ్యవర్తులపై మంగళవారం కాసిపేట పోలీస్‌స్టేషన్‌లో బాధిత రైతులు ఫిర్యాదు చేశారు. బాధిత రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. సింధు కంపెనీ అనే పేరుతో కొంత మంది స్థానికులు మధ్యవర్తులతో కలిసి రైతులకు బాస్మతి వడ్లను అందించి పంట వేసుకోవాలని, పంట బాగా వస్తుందని చెప్పి వడ్లను ఇచ్చారు. వడ్లను అందించిన వారే పంటను కొంటామని తెలపడంతో నమ్మి పంటలు వేశారు. సోమగూడెం, పెద్దనపల్లి, సంద్రలిపేట, ముత్యంపల్లి, వరిపేటతో పాటు పలు గ్రామాల్లో సుమారు 70 ఎకరాల వరకు ఎకరానికి రూ.30 వేలు ఖర్చు చేసి పంటలను వేశారు. దీంతో ఆ పంట పూర్తిగా పురుగు పట్టి, ఏ మాత్రం ఎదుగుదలలేక పంట చచ్చిపోయి పూర్తిగా నష్టపోయారు. వేసిన పంట ఖర్చు చేసినవి పూర్తి నష్టపోయామని, నకిలీ విత్తనాలు వాడినవారు చాలా మంది ఉన్నారు. సుమారు 70 ఎకరాలకు రూ.21 లక్షల వరకు పెట్టుబడి నష్టపోయినట్లు వివరించారు. లాభం వస్తుందన్న పంట పూర్తిగా నష్టపోయమని, పంట వేసే క్రమంలో కాసిపేట మండల వ్యవసాయాధికారులకు తెలిపామని, దానికి అధికారులు పంటలు వేసుకోవాలని సూచించినట్లు తెలిపారు. ఇప్పుడు పట్టించుకోవడం లేదన్నారు. కనీసం నష్టపోయిన పెట్టుబడినైనా ఇప్పించాలని కోరారు. తమకు నష్టపరిహారం ఇప్పించాలని సదురు కంపెనీపై చర్యలు తీసుకోవాలని బాదిత రైటులు కోరుతున్నారు. ఈ విషయమై బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య విన్నవించగా వెంటనే విచారణ చేపట్టి రైతులకు న్యాయం చేసే విధంగా చూడాలని పోలీసులకు సూచించారు.

అవినీతికి పేటెంట్ కాంగ్రెస్

- బ్లాక్ మెయిల్‌కు పేటెంట్ రేవంత్‌రెడ్డి
- ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బాల్క సుమన్

నవతెలంగాణ-జైపూర్



అవినీతికి పెటెంట్ కాంగ్రెస్ అని, బ్లాక్ మెయిల్‌కు పెంటెంట్ ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్ రెడ్డి అని అటువంటి వ్యక్తి నిజామాబాద్ జిల్లాలో పర్యటిస్తూ మాట్లాడుతున్న తీరు హస్యాస్పదమని చెన్నూర్ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బాల్క సుమన్ అన్నారు. మంగళవారం చెన్నూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దొంగల మూఠాకు అధ్యక్షుడైన రేవంత్‌రెడ్డి అవినీతి గురించి మాట్లాడటం దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉంటుందని అన్నారు. రాష్ట్ర రాజధానిలో సచివాలయం నిర్మించడం, అమరవీరుల స్మారక సౌదం నిర్మించడం, 125 అడుగుల ఆంబేద్కర్ విగ్రహం కట్టడం కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు మింగుడు పడటం లేదని అన్నారు. 2004లో సోనియాగాంధీ కరీంనగర్‌లో తెలంగాణపై మాట మార్చిన విషయం రేవంతర్‌రెడ్డి గుర్తు తెచ్చుకోవాలని అన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో 2004 నుండి 2016 వరకు వెయ్యి మందికి పైగా అమరులవ్వడానికి కారణం కాంగ్రెస్ కాదా అని ప్రశ్నించారు. ఏ టూ జెడ్ స్కాం కాంగ్రెస్ హయాంలోనే, ఏ వర్గాన్ని పట్టించుకున్న పాపాన పోలేదని విమ్మర్శించారు. మోడీ తాటాకు చప్పుల్లకు భయపడేది లేదని ఉద్యమ సయంలో వందల కేసులు ఎదుర్కొని తెలంగాణను సాధించుకున్న చరిత్ర బీఆర్ఎస్ నాయకులదని పేర్కొన్నారు. ప్రస్తుతం దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ సాగుతోందన్నారు. కేసీఆర్‌ను ఎదుర్కొనే దమ్ము లేక కవితపై ఈడీ దాడులు చేస్తున్నారని, దమ్ముంటే అభివృద్దిలో పోటీపడాలని, బీజేపీకి కూల్చుడు, పేల్చుడు తప్పా ఏమీ తెలియదని పేర్కొన్నారు.

మంత్రి హరీష్ రావు పర్యటన విజయవంతం చేయాలి

నియోజకవర్గంలో బుధవారం పర్యటించనున్న రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు పర్యటనను నియోజకవర్గ ప్రజలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఉదయం తొమ్మిది గంటలకు జైపూర్ మండలం ఇందారం నుంచి మొదలు చెన్నూర్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు శంకు స్థాపనలు, ప్రారంభోత్సవాలు ఉంటాయని తెలిపారు. అనంతరం చెన్నూర్ పట్టణంలో ఏర్పాటు చేయ తలపెట్టిన భారీ బహిరంగ సభలో తెలంగాణ ఏర్పాటు తర్వాత జరిగిన అభివృద్ధి, చేపట్టిన సంక్షేమ పథకాలు ప్రజల ముందు ఉంచడం జరుగుతుందని పేర్కొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన

నవతెలంగాణ-తాండూర్

క్షయ దివాస్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని రేచిని ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రంలో మంగళవారం క్షయ వ్యాధిపై మండల వైద్యాధికారి కుమారస్వామి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగ తాగడం, తంబాకు ఉత్పత్తుల వాడకం వంటి వ్యసనాలకు దూరంగా ఉంటూ సరియైన జాగ్రత్తలు పాటించినట్లయితే టీబీ భారిన పడకుండా ఉంటారని తెలిపారు. పొడి దగ్గు ఊపిరి తీసుకోవడంలో ఇబ్బందులు ఉన్నవారు టీబీ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. మొదటి దశలో టీబీ వ్యాధిని గుర్తించినట్లయితే వ్యాధి నుండి కోలుకునే అవకాశాలు ఉన్నాయని తెలిపారు.



ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో టీబీ వ్యాధి నిర్ధారణ పరీక్షలు మందులు ఉచితంగా పంపిణీ చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో 20 మందికి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ మహాలక్ష్మి, ఎంఎల్ హెచ్ రజిత, ఏఎన్ఎం రాజమణి శ్రీలత, ఆశ కార్యకర్తలు సుమలత, దేవి పాల్గొన్నారు.

నేడు వైద్యారోగ్య శాఖ మంత్రి పర్యటన



నవతెలంగాణ-కోటపల్లి

చెన్నూర్ నియోజకవర్గంలో బుదవారం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు పర్యటన నేపథ్యలో మంగళవారం ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బాల్క సుమన్ పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో రూ.200 కోట్ల నిధులతో పలు అభివృద్ధి పనులను మంత్రి ప్రారంభించనున్నారని తెలిపారు. మొదటగా హరీష్ రావు జోడు వాగుల వద్ద డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అర్బన్ ఎకో పార్క్ ప్రారంభోత్సవం ఉంటుందని తెలిపారు. అనంతరం రూ.2.50 కోట్లతో నిర్మించిన కేసీఆర్ పార్క్ ప్రారంభం ప్రారంభిస్తారన్నారు. చెన్నూరు పట్టణంలో రూ.25 కోట్లతో జలాల్ పెట్రోల్ బంక్ నుంచి అంబేద్కర్ చౌక్ వరకు నూతనంగా నిర్మించిన నాలుగు లైన్ల ప్రధాన రహదారి సెంట్రల్ లైటింగ్ ప్రారంభిస్తారని తెలిపారు. అలాగే రూ.9 కోట్లతో నూతనంగా నిర్మించిన పెద్ద చెరువు మినీ ట్యాంక్ బండ్, కుమ్మరి కుంట మినీ ట్యాంక్ బండ్ ప్రారంభోత్సవం ఉంటుందని అన్నారు. చెన్నూరు పట్టణంలో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రికి శంకుస్థాపన, ఎంసీహెచ్ పనుల పర్యవేక్షణ జరుగుతుందని అన్నారు. రూ.5 కోట్లతో చెన్నూరు పట్టణంలో నూతనంగా నిర్మించిన మినీ స్టేడియం ప్రారంభోత్సవం, నూతనంగా ఏర్పాటు చేయనున్న బస్సు డిపోకు శంకుస్థాపన చేస్తారని తెలిపారు. అదేవిదంగా రూ.1.50 కోట్ల నిధులతో నూతనంగా నిర్మించనున్న సమ్మక్క సారలమ్మ మహిళా భవన్ శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. అనంతరం చెన్నూరు పట్టణంలో నిర్వహించే సభలో నూతనంగా నియామకమైన చెన్నూర్ మార్కెట్ కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం ఉంటుందన్నారు.



కంటి వెలుగు లక్ష్య సాధనకు కృషి చేయాలి

నవతెలంగాణ-జైపూర్

రాష్ట్ర ప్రభుత్వం 2వ విడతన చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అధికారులు కృషి చేయాలని మంచిర్యాల కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆదేశించారు. మిట్టపల్లిలో కొనసాగుతున్న కంటి వెలుగు శిబిరాన్ని మంగళవారం అకస్మికంగా తనిఖీ చేసిన ఆయన కంటి పరిక్షల తీరును పరిశీలించారు. ఈ సంధర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమంలో జిల్లా పరిధిలో 18 సంవత్సరాల నిండిన వారికి కంటి పరిక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 40 కంటి వెలుగు శిబిరాలు ఏర్పాటు చేసి ప్రతి శిభిరాన్ని ఒక బృందంగా నియమించినట్లు పేర్కొన్నారు. ఇప్పటి వరకు జిల్లా పరిధిలో 153 గ్రామ పంచాయతీలు, 78 వార్డుల్లో కంటి వెలుగు నిర్దేశిత లక్ష్యాన్ని పూర్తి చేసినట్లు వెల్లడించారు. సుమారుగా 98 వేల 339 మంది పురుషులు, లక్షా 10 వేల 825 మంది మహిళలు, 79 మంది ఇతరులకు పరిక్షలు నిర్వహించి రీడింగ్ అద్దాలు అవసరమున్న 35 వేల 382 మందికి అందించినట్లు తెలిపారు. ప్రిస్కృప్షన్ అద్దాలు ఆర్డర్ చేసి 11 వేల 716 మందికి అందించినట్లు తెలిపారు. కంటి వెలుగు శిబిరంలో ప్రజలకు కంటి పరిక్షలు నిర్వహించి మందులు, అవసరమైన వారికి రీడింగ్ అద్దాలు ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అర్హత గల ప్రజలందరికీ కంటి పరిక్షలు నిర్వహించి 100 శాతం లక్ష్యాలను పూర్తి చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో జైపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి అనిల్, కంటి వెలుగు వైద్యాధికారి వేదశ్రీ, డీఈఓలు తేజస్వీ, లావన్య, అప్తాల్మిస్ట్ స్వాతి పాల్గొన్నారు.

మండలంలో ఎమ్మెల్యే విస్తృత పర్యటన



నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని ఆయా గ్రామంలో బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్న మంగళవారం విస్తృతంగా పర్యటించారు. ముత్యంపల్లిలోని దుబ్బగూడెంలో గ్రామస్తులతో సమావేశమై సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామానికి రోడ్డు సమస్యలపై విన్నవించగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కాసిపేట పంచాయతీలోని సంద్రల్పాడు గ్రామంలో గ్రామస్తులు సమావేశం నిర్వహించారు. ప్రజలతో నేరుగా మాట్లాడి ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధి, చేయాల్సిన పనులపై గ్రామస్తులతో చర్చించారు. గ్రామంలో ఎన్నో ఏళ్లుగా ఉన్న రోడ్డు ఇబ్బందులు రూ.50 లక్షలతో పరిష్కరించడంతో గ్రామస్తులు ఎమ్మెల్యేకు శాలువాతో సన్మానం చేశారు. కోమటిచేను గ్రామ పంచాయతీలోని వరిపేట గ్రామంలో నేరుగా ప్రజలతో సమావేశమై ప్రజలతో మాట్లాడారు. అనంతరం బుగ్గగూడెం గ్రామంలో పర్యటించి ప్రజలతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. రూ.10 లక్షల జిల్లా పరిషత్ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. దీంతో పాటు రూ.5 లక్షల మండల పరిషత్ నిధులతో అదనపు తరగతి నిర్మాణాలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ రొడ్డ లక్ష్మీ, జడ్పీటీసీ పల్లె చంద్రయ్య, వైస్ ఎంపీపీ విక్రంరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమణారెడ్డి, సర్పంచులు బాదు, రాంటెంకి శ్రీనివాస్, దేవి, ఎంపీటీసీ రాంచందర్, ఉప సర్పంచులు బోయిని తిరుపతి, సుమన్, మోటూరి వేణు, భూక్య రాంచందర్, సత్రవేణి రేణుక, లంక లక్ష్మణ్ పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధుల ఉదారత

జన్నారం : మండలంలోని పోన్కల్ గ్రామానికి చెందిన గోపి శ్రీను తల్లి రాజేశ్వరిని పరామర్శించి రూ.30వేల ఆర్థిక సాయం అందించారు. ప్రజాప్రతినిధులు, మానవతావాదుల నుండి సేకరించిన మొత్తాన్ని బాధిత కుటుంబానికి అందజేసి ఉదారత చాటుకున్నారు. శ్రీను ఇటీవల మృతి చెందడంతో కుటుంబానికి చేయూత అందించామని మాదాడి పూర్ణ చందర్‌రావు, జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, ఎంపీపీ మాదాడి సరోజన రవీందర్‌రావు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కొంతం శంకరయ్య, కాసెట్టి లక్ష్మణ్, శ్రీరాముల గంగాధర్, మధుసూదన్‌రావు, గురువయ్య, లక్ష్మీనారాయణ, సునీత, రాజన్న, జాడి గంగాధర్, వాసు పాల్గొన్నారు.



నిక్షయ్ దివస్ సందర్భంగా హెల్త్ మేళాలు

వేమనపల్లి : ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిదిలోని జల్లెడ, ముల్కలపేట, నీల్వాయి ఆరోగ్య సంరక్షణ కేంద్రాలలో మంగళవారం నిక్షయ్ దివస్‌ను పురస్కరించుకొని వైద్యాధికారి డా.రాజేష్ ఆధ్వర్యంలో హెల్త్ మేళాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 170 మందికి బిపి, షుగర్ పరీక్షలు చేశారు. లక్షణాలను అనుసరించి 37 మంది నుండి టిబి.నిర్ధారణ నిమిత్తం తెమడ సేకరించారు. ఈ కార్యక్రమంలో మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్స్ శ్రీవాణి, కీర్తి, ప్రవల్లిక, హెల్త్ అసిస్టెంట్ రాంశెట్టి బాపు, టిబి సూపర్‌వైజర్ అశోక్, ఎఎన్ఎంలు మంజుల, విజయలక్ష్మి, తిరుపతమ్మ ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువ కావాలి

- మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి



నవతెలంగాణ-నిర్మల్

ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువకావాలని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. కలెక్టర్ సమావేశం మందిరంలో మంగళవారం జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులతో అభివృద్ధి సంక్షేమ పథకాల అమలుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రభుత్వ పథకాలన్నీ ప్రజలకు వరంగామారాలని అన్నారు. తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అత్యంత ప్రజాదరణ కలిగిన పథకాలను ప్రవేశ పెడుతూ అభివృద్ధిలో ప్రగతి పథంలో దూసుకుపోతుందని అన్నారు. ఈ పథకాల వల్ల సామాన్యుల ఆర్థిక, సామాజిక పరిస్థితులు మెరుగవుతున్నాయని అన్నారు. నిర్మల్ జిల్లాను అభివృద్ధిలో తీర్చిదిద్దే క్రమంలో చేపడుతున్న పలు పనులు వేగవంతంగా జరిగేలా ప్రణాళికను రూపొందించుకొని, త్వరగా పనులను పూర్తి చేసుకోవాలని సూచించారు. విద్యా, వైద్యంతో పాటు వివిధ శాఖలలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని సూచించారు. రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకొని మంచినీటి సమస్యలు తలెత్తకుండా జిల్లాలోని అన్ని ఆవాసాలకు మంచినీరు సక్రమంగా అందేలా చూడాలని ఆదేశించారు. మిషన్ భగీరథ పనుల నిర్వహణలో అలసత్వంగా వ్యవహరించకుండా, పనులను జాప్యం చేయకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. నిధుల విషయంలో ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఎప్పటికప్పుడు సంబంధితపై అధికారులతో చర్చించడం జరుగుతుందని తెలిపారు. పామాయిల్ తోటలను ఎక్కువగా విస్తరించాలని జిల్లాలో ఇప్పటి వరకు 3,550 ఎకరాలో సాగు చేయడం జరుగుతోందని అన్నారు. మార్చి నెలాఖారులోగా 150 ఎకరాలలో సాగుచేయడం జరుగుతుందని, అంతర పంటలుసాగు, ఎరువుల కొరకు రూ. 4,200 ఎకరానికి రైతులకు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. అన్ని శాఖల అధికారులను అభివృద్ధి పనుల తీరును అడిగి తెలుసుకొని ఆయా శాఖలలో ఉన్న పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో కలెక్టర్ కె.వరుణ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు విఠల్‌రెడ్డి, రేఖానాయక్, నిర్మల్, ఖానాపూర్ మున్సిపల్ చైర్మెన్లు ఈశ్వర్, రాజేందర్, డీఎస్పీ జీవన్ రెడ్డి, డీఆర్వో లోకేష్, ఆర్డీఓ స్రవంతి, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

దళితబంధు లబ్దిదారుల ఆందోళన



నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని కజ్జర్ల గ్రామానికి చెందిన దళితులకు గత కొద్ది నెలల క్రితం దళితబంధు పథకం అమలు చేసినప్పటికీ, సంబంధిత పథకాల డబ్బులు సగం వరకు చెల్లించి, మిగతా డబ్బుల కోసం ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, ఎంపీడీఓ అధికారుల చుట్టూ తిరుగుతున్న, నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో వారు లబోదిబోమంటున్నారు. బీఆర్ఎస్ బోథ్ నియోజకవర్గ అధికార ప్రతినిధి కిరణ్ కుమార్, దళితబంధు లబ్ధిదారులు జీవన్, రమణ, శ్రీనివాస్, స్వామి మంగళవారం లబ్ధిదారులు ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. సీఎం కేసీఆర్ దళితబంధు పథకాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టారు. అందులో భాగంగా ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు లబ్ధిదారులను ఎంపిక చేశారు. దళితబంధు పథకం అధికారుల నిర్లక్ష్యంతో అభాసుపాలు అవుతుందని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేశారు. కజ్జర్ల గ్రామంలో 10 మంది దళిత కుటుంబాలకు దళితబంధు మంజూరు చేయగా, అందులో ఆరు యూనిట్లు గ్రౌండింగ్ చేశారు. మిగతా నాలుగు యూనిట్లుకు రూ.5లక్షలు లబ్ధిదారులకు అందించారు.ఇంకా రూ.5లక్షల కొరకు గత తొమ్మిది నెలలుగా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ చుట్టూ, మండల ఎంపీడీఓ చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని, సంతకాలు చేయడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈడీ, ఎంపీడీఓ ఇద్దరు కలిసి సంతకాలు చేయాల్సి ఉండగా ఇద్దరు అధికారులు ఒకరిపై ఒకరు నెట్టుకోవడంతో లబ్ధిదారులు మానసికంగా ఆందోళన చెందుతున్నట్లు తెలిపారు. కేవలం సంతకాల కోసం నెలల తరబడి అధికారుల చుట్టూ తిరిగిన పట్టించుకోకపోవడం పట్ల అధికారుల మతలబుఏమిటని లబ్ధిదారులు ప్రశ్నించారు. దళితబంధు పథకం వస్తుందని ఆశతో ప్రయివేటు ఉద్యోగాలు మానేసి, 9 నెలలుగా అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేసిన కరుణించడం లేదని అన్నారు. ఎంపీడీఓను అడిగితే దళితబంధుకు మాకు సంబంధం లేదని, సంతకం చేయనని ఏమి చేసుకుంటారో చేసుకోమ్మని అన్నారు. బదిలీ చేస్తారా అంటూ లబ్ధిదారులనే ప్రశ్నించారు. లబ్ధిదారులు ఉన్న ఉద్యోగాలు వదిలేసి పూట గడవడం కొరకు కష్టపడుతున్నామని తెలిపారు. సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోని, దళితబంధు పథకం మిగతా డబ్బులు లబ్ధిదారులకు అందించి న్యాయం చేయాలని కోరారు.

ఉపాధి హామీ చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండలంలోని పొట్టపెల్లి (కె) గ్రామంలో మంగళవారం ఉపాధి హామీ పనులను సర్పంచ్ ఉల్వాజీ హైమావతి రాజు పరిశీలించారు. పనులకు సుమారు 200 మంది కూలీలు హాజరయ్యారు. ప్రతి ఒక్కరూ ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ అన్నారు. బుధవారం ఉపాధి హామీ పీడీ పొట్టపెల్లి(కె) గ్రామంలో జరుగుతున్న పనులను పరిశీలించండం జరుగుతుందని పేర్కొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు కొనసాగించాలి

- ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్‌రాజ్
- జైనథ్, బేల మండలాల్లో పర్యటన



నవతెలంగాణ-జైనథ్, బేల

గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు నిరంతరం కొనసాగించాలని, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను సజావుగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పిఎస్ అన్నారు. మంగళవారం జైనథ్, బేల మండలాల్లోని పలు గ్రామాల్లోని పల్లెప్రకృతి వనాలు, ఆరోగ్య కేంద్రాలు, పాఠశాలలు, నర్సరీలు, కంటి వెలుగు శిబిరాలు, మండల కార్యాలయాలను అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి సందర్శించారు. జైనథ్ మండలం కూర గ్రామంలోని నర్సరీని కలెక్టర్ పరిశీలించి, ప్రజల డిమాండ్ మేరకు మొక్కలు నాటి సంరక్షించాలని, హరితహారం కార్యక్రమంలో నాటికి మొక్కలు ఎదిగేలా చర్యలు చేపట్టాలని ఎంపీడీఓను ఆదేశించారు. బహుదూర్‌పుర గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో చేపట్టిన మన ఊరు-మన బడి పనులను, తాగునీటి వసతులను పరిశీలించి పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బహుదూర్‌పుర నుండి మహారాష్ట్ర సరిహద్దులోని దిగ్రాస్‌కు వెళ్లే వర్షాకాలంలో దెబ్బతిన్న రోడ్డు బ్రిడ్జి పనులను పరిశీలించి ఆర్అండ్‌బి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం సందర్శించి కేంద్రం ద్వారా ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలు, క్షయ వ్యాధి గ్రస్తులకు వైద్య సహకారం, కౌన్సెలింగ్, మందుల పంపిణీ, పింఛన్ మంజూరు వంటి వాటిపై మెడికల్ ఆఫీసర్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కూర గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలోని కంటి వెలుగు శిబిరాన్ని సందర్శించి పరీక్షల నిర్వహణ, కళ్లద్దాల పంపిణీ తదితర విషయాలను మెడికల్ ఆఫీసర్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం పరిశీలించారు. విద్యార్థులతో ముచ్చటిస్తూ భోజనం ఎలా ఉంది, ఏమేమి అందిస్తున్నారు, మంచిగా చదువుతున్నారా అనే విషయాలను రాబట్టారు. ఉన్నత పాఠశాలలోని పదవతరగతి విద్యార్థులతో మాట్లాడుతూ వార్షిక పరీక్షలకు సన్నద్ధం కావాలని తెలిపారు. స్థానిక ప్రజలు కలెక్టర్‌ను కలిసి పింఛన్, భూ సమస్యలు, రెండు పడక గదుల ఇండ్లు మంజూరు చేయాలని కోరారు. అనంతరం బేల మండలం సాంగిడి గ్రామంలోని రైతువేదికను కలెక్టర్ పరిశీలించి, పల్లె ప్రకృతి వనాన్ని సందర్శించి మియావాకి పద్ధతిలో ప్లాంటేషన్ చేపట్టాలని సూచించారు. మరుగుదొడ్ల పనులను పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలని, మండల విస్తరణ అధికారులు రోజువారి పర్యటన, కార్యక్రమాలకు సంబంధించి వివరాలను ఫ్లెక్సీ ఏర్పాటు చేసి నమోదు చేయాలని పేర్కొన్నారు. అనంతరం బేల మండల కేంద్రంలోని తహసీల్దార్, మండల పరిషత్, గ్రంథాలయాలం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను కలెక్టర్ సందర్శించి భవనాల స్థితిగతులను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జైనథ్ మండలం తర్నం గ్రామం వద్ద గల దెబ్బతిన్న బ్రిడ్జిని పరిశీలించి తాత్కాలిక రవాణా సౌకర్యాలకు పనులు చేపట్టాలని ఆర్అండ్‌బి అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, ఆర్అండ్‌బి డిప్యూటీ ఈఈ సురేష్, ఆయా మండల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, సర్పంచులు, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



పేద ప్రజల ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం చేయొద్దు

- ఏజెన్సీ డీఎంఅండ్‌హెచ్ఓ కుమ్రు బాలు



నవతెలంగాణ - జైనూర్

ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యమందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం చేయరాదని ఏజెన్సీ డీఎం అండ్ హెచ్ఓ కుమ్రు బాలు అన్నారు. మంగళవారం ఉషెగావ్ ప్రభుత్వ ఆస్పత్రిలో ఆదివాసీ మిత్రా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తహీనతతో బాధపడుతున్న వారికి పౌష్టికాహారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థ ద్వారా ప్రజలకు పౌష్టికాహారం అందించడం అభినందనీయమన్నారు. ఆదివాసీ మిత్రా వెల్ఫేర్ సొసైటీ, ఎన్‌జీఓ సభ్యులైన కొట్నాక ప్రవీణ్, గెడం జనార్ధన్ సౌజన్యంతో గర్భిణులకు, రక్తహీనతతో బాధపడుతున్న వారికి పౌష్టికాహారం అందించడానికి ముందుకురావడం అభినందనీయమన్నారు. స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో సంతోషకరమన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రక్తహీనతతో బాధపడకుండా ఉండేందుకు గర్భిణులకు పౌష్టికాహారం అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతుందని తెలిపారు. అనంతరం జైనూర్ ప్రభుత్వ ఆస్పత్రిని తనిఖీ చేశారు. ప్రభుత్వ ఆస్పత్రిలో అందిస్తున్న వైద్యసేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో మందుల కొరత, రోజూవారీగా వచ్చే రోగుల వివరాలను వైద్యాధికారులు అశోక్, జితేందర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రికి అవసరమున్న సదుపాయాలు కల్పిస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వ ఆస్పత్రికి మొదటిసారిగా రావడంతో వైద్యాధికారులు, వైద్య సిబ్బంది శాలువాలతో సన్మానించారు. ఆయన వెంట లింగాపూర్ జెడ్పీటీసీ అడ రక్మాబాయి లక్మానాయక్, వైద్యాధికారులు జితేందర్, అశోక్, హెచ్ఈఓ ప్రకాష్, ఆదివాసీ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు అడ వెంకట్, సూపర్‌వైజర్ లక్ష్మీకుమారి, సంస్థ సభ్యులు అడ గౌతమి, ఆత్రం నీలకంఠ్, చాప్లె ప్రవీణ్, స్టాఫ్ నర్సు ఆత్రం చంద్రకళ, టెక్నీషియన్ సంగీత, ఫార్మాసిస్టు సాగర్ ఉన్నారు.

కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలి

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ముంజం శ్రీనివాస్



నవతెలంగాణ - దహెగాం

స్కీం వర్కర్లకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ముంజం శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో సీఐటీయూ మండల మహాసభ నిర్వహించారు. మహాసభలో ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు, మధ్యాహ్నభోజన, హమాలీ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ స్కీం ప్రయివేటీకరణ ఆపాలని, స్కీం వర్కర్లకు బడ్జెట్ పెంచి బలోపేతం చేయాలన్నారు. కనీస వేతనం రూ.26 వేలు చెల్లించి కార్మికులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 ఏండ్లు గడిచినా స్కీం వర్కర్ల సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని పేర్కొన్నారు. ఒకవైపు నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటుతుంటే కార్మికులకు మాత్ర ంచాలీచాలని వేతనాలు ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులంతా పనిభారంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్కీం వర్కర్లను చట్టం పరిధిలోకి తీసుకురావడానికి నిరాకరిస్తున్నాయని, వారి సంక్షేమం గాలికొదిలేశాయని తెలిపారు. కార్మికులను నిర్వీర్యం చేసే నిర్ణయాలు తీసుకొస్తున్నాయని, వీటన్నింటిని ఆపాలంటే పెద్దఎత్తున నిరసనలు తెలపాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా తమ పరిధిలోని సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేస్తుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలను ప్రజలకు చేరడంలో స్కీం వర్కర్లు కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. సీఐటీయూ జిల్లా నాయకుడు వెలిశాల కృష్ణమాచారి మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని, ఉద్యోగభద్రత కల్పించాలని, ప్రయివేటీకరణను ఆపాలని డిమాండ్ చేశారు. అనంతరం మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కన్వీనర్‌గా వజ్రమ్మ, కోకన్వీనర్‌గా రమేష్, పెంటయ్య, సభ్యులుగా శోభ, పుష్పలత, రాజ్‌కుమార్, సాయికృష్ణ, రవికుమార్, సమత, విజయ, పద్మ, లలిత, నాగరాజ్, తిరుపతి, బాపురావు, సకారాం, మల్లేష్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ, ఆశా, హమాలీ, మిషన్ భగీరథ, వీఆర్ఏ తదితర రంగాల కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నిబంధనల మేరకు విధులు నిర్వర్తించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఇంటర్ బోర్డు నిబంధనల మేరకు విధులు నిర్వర్తించాలని జిల్లా మాధ్యమిక విద్యాధికారి డా.శ్రీధర్ సుమన్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఇంటర్ విద్యా కార్యాలయంలో పరీక్ష పర్యవేక్షకులకు (స్క్వాడ్ బృందాల) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షల్లో కాపీయింగ్‌ను నిరోధించడానికి, బోర్డు నియమ నిబంధనల అమలు పరిశీలించాలని సూచించారు. స్క్వాడ్ బృందాలు ఉదయమే పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని ప్రశ్నపత్రం తీసుకెళ్లే సెట్, సమయం తదితర అంశాలను పరిశీలించాలన్నారు. ఇంటర్ బోర్డు ఆదేశాల మేరకు పరీక్షా కేంద్రాల్లో డ్యుయల్ డెస్కులు, సీసీ కెమెరాలు, ఇంటర్నెట్, కంప్యూటర్, ప్రింటర్ తదితర సదుపాయాలను పరిశీలించాలని పేర్కొన్నారు. విద్యార్థుల హాజరు, మాల్ ప్రాక్టీస్ తదితర అంశాలపై రోజువారీ నివేదికలు రాస్తూ సంబంధిత కేంద్ర నిర్వాహకుల సంతకాలు తీసుకోవాలన్నారు. పరీక్షల నిమిత్తం 20 కేంద్రాలున్నాయని, ఇందులో 11 ప్రభుత్వ, 6 ప్రభుత్వ రంగ, 3 ప్రైవేటు కళాశాలలున్నాయని తెలిపారు. ఈ సమావేశంలో డీఈసీ సభ్యులు నైతం శంకర్, సీహెచ్ తిరుపతి, స్క్వాడ్ అధికారులు పాల్గొన్నారు.



నేటి నుండి ఇంటర్ వార్షిక పరీక్షలు

నవతెలంగాణ - కౌటాల

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సెంటర్ నెంబర్ 32004 పరీక్ష కేంద్రంలో ప్రథమ సంవత్సరం విద్యార్థులకు బుధవారం నుండి పరీక్షలు నిర్వహించనున్నట్టు పరీక్ష కేంద్రం ప్రిన్సిపాల్ స్వరూప తెలిపారు. ప్రథమ సంవత్సరం జనరల్ విద్యార్థులు 235 మంది, ఒకేషనల్ విద్యార్థులు 144 మంది పరీక్షకు హాజరుకానున్నట్టు తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. ఆమె వెంట డిపార్టుమెంట్ ఆఫీసర్ సునీత ఉన్నారు.

జైనూర్ : నేటి నుండి జైనూర్, సిర్పూర్(యు), లింగాపూర్ మండలాలకు చెందిన విద్యార్థులకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం వార్షిక పరీక్షలు నిర్వహిస్తున్నట్టు జైనూర్ కళాశాల ప్రిన్సిపాల్ బి శ్రీదేవి తెలిపారు. పరీక్ష ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉంటుందని, విద్యార్థులు పరీక్ష కేంద్రానికి సమయానికి హాజరుకావాలని తెలిపారు. సమయానికి హాజరుకానీ విద్యార్థులను పరీక్ష హాలులోకి అనుమతించబోమని తెలిపారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మొత్తం 391 మంది పరీక్షలు రాయనున్నట్టు తెలిపారు. పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామని, కళాశాల ఆవరణలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని, అందరు సహకరించాలని కోరారు.

దహెగాం : నేటి నుండి ఇంటర్ వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నట్టు ప్రిన్సిపాల్ అమరేందర్ తెలిపారు. మొదటిరోజు తెలుగు, హిందీ పరీక్షలు నిర్వహిస్తామని, విద్యార్థులు తమకు కేటాయించిన సెంటర్లకు గంట ముందే చేరుకోవాలని సూచించారు. పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు పేర్కొన్నారు.

నార్నూర్ : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సెంటర్‌లో పరీక్షలకు ఏర్పాట్లు పూర్తయ్యాని తెలిపారు. పరీక్షలు రాయడానికి వస్తున్న విద్యార్థులకు నీటి వసతి, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండే విధంగా అన్ని సౌకర్యాలతో కూడిన పూర్తి ఏర్పాటు చేశామని తెలిపారు. బుధవారం జరిగే ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలో 293 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్టు తెలిపారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు సన్నాహాలు చేశామన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు సమయానికి ముప్పై నిమిషాల ముందే చేరుకోవాలని సూచించారు. వారి వెంట డీఓ శ్రీలత కళాశాల ఇన్‌ఛార్జి కాంబ్లే బాలాజీ ఉన్నారు.

పీపీఆర్ఎంఎస్ హెల్త్‌కార్డులకు దరఖాస్తు చేసుకోవాలి

నవతెలంగాణ - రెబ్బెన

జీఎం కార్యాలయంలోని పర్సనల్ డిపార్టుమెంట్‌లో ఏరియాలోని సంక్షేమాధికారులు, పర్సనల్ డిపార్టుమెంట్ అధికారులతో జీఎం (పర్సనల్ వెల్ఫేర్) కె బసవయ్య మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పీపీఆర్ఎంఎస్ హెల్త్‌కార్డులపై దరఖాస్తు, వినియోగం, రెన్యూవల్ అంశాలపై అవగాహన కల్పించారు. సందేహాలను నివృత్తి చేశారు. పదో వేజ్‌బోర్డులో పనిచేసి పదవి విరమణ పొందిన ఉద్యోగులకు పీపీఆర్ఎంఎస్ హెల్త్‌కార్డుల కోసం మరొక అవకాశం కల్పించారన్నారు. కార్డు పొందేందుకు రూ.40 వేలు డీడీ రూపంలో చెల్లించాలన్నారు. కొంత రుసుం ఇప్పటికే చెల్లించిన వారు మిగతా రుసుం చెల్లించి మార్చి 31లోగా సంబంధిత గనులు, డిపార్టుమెంట్లలో దరఖాస్తులు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ ఐ లక్ష్మణ్‌రావు, డీవైపీఎం రెడ్డిమల్ల తిరుపతి, సీనియర్ పర్సనల్ అధికారి జీకె కిరణ్‌కుమార్, సంక్షేమాధికారి ప్రశాంత్ పాల్గొన్నారు.

టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీక్‌పై నిరసన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

టీఎస్పీఎస్సీ పేపర్ల లీకుల వ్యవహారంపై విద్యార్థులు, నిరుద్యోగ అభ్యర్థులు భగ్గుమన్నారు. మంగళవారం పట్టణంలోని స్థానిక కేంద్ర గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులు లైబ్రరీ ఆవరణలో బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి, పాలకులకు వ్యతిరేకంగా నినాదాలతో హోరెత్తించారు. వీరికి బీజేపీ నాయకులు కంది శ్రీనివాసరెడ్డి సంఘీభావం ప్రకటించారు. టీఎస్ పీఎస్సీతోపాటు ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. టీఎస్పీఎస్సీ ద్వారా గతంలో నిర్వహించిన పరీక్షలపై సైతం పలు అనుమానాలు ఉన్నాయని అన్నారు. పారదర్శకత పాటించకుండా నిరుద్యోగ అభ్యర్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని మండిపడ్డారు. పేపర్ లీకేజీ బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జరగబోయే పరిణామాలకు పూర్తి బాధ్యత ప్రభుత్వానిదేనని హెచ్చరించారు.

పిల్లలకు పౌష్టికాహారం అందించాలి

నవతెలంగాణ-తాంసి

అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు పౌష్టికాహారం అందించాలని తాంసి ఎస్సై లాల్ సింగ్ నాయక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మిత్ర నాలెడ్జ్ సెంటర్‌లో మహిత స్వచ్ఛంద సంస్థ అధ్వర్యంలో అంగన్‌వాడీలకు పూర్వ ప్రాథమిక విద్యాపై గ్రామ సర్పంచ్ తో కలిసి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని పిల్లకు పెట్టాలని అన్నారు. పౌష్టికాహారం అందక గతంలో మారుమూల గ్రామాల్లో ఉంటున్న పిల్లలు రక్త హీనత లోపంతో బాధపడేవారని అన్నారు. పిల్లల తల్లులు తమ పిల్లలకు గుడ్డు అంగన్‌వాడీ కేంద్రాలలో ఇచ్చే ఆహారాన్ని పెట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ స్వప్న రత్న ప్రకాష్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సుజాత, ఎంఈఓ శ్రీకాంత్, మహిత ప్రొగ్రాం ఇన్‌చార్జీ కిషోర్, మండల కోఆర్డినేటర్ ఇమ్రాన్ ఖాన్, మహిత సిబ్బంది ఉన్నారు.

బీడీ కార్మికులకు కరువుభత్యం అమలు చేయాలి

నవతెలంగాణ-లక్ష్మణచాంద

బీడీ ఫ్యాక్టరీలలో పెరిగిన కరువు భత్యం అమలు చేయాలని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.గంగన్న మాట్లాడుతూ బీడీ కార్మికులకు ఏప్రిల్ 1 నుండి రూ.9.40 కరువు భత్యం పెరిగిందన్నారు. ఏప్రిల్ 1 నుండి అమలు చేయాలని యాజమాన్యాలను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కిషన్, శంకర్, సాయన్న, ఆశన్న, లింగన్న పాల్గొన్నారు.

పది పరీక్షలకు
పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

నవతెలంగాణ-నిర్మల్

జిల్లాలో పదో తరగతి పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ వరుణ్‌రెడ్డి అన్నారు. మంగళవారం కలెక్టర్ సమావేశం మందిరంలో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్షల నిర్వహణపై సమన్వయ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రభుత్వం నిర్దేశించిన షెడ్యూలు ప్రకారం జిల్లాలో వచ్చే నెల ఏప్రిల్ 3వ తేది నుండి 13 వరకు పదోతరగతి పరీక్షలు జరగనున్నట్లు తెలిపారు. పరీక్షలకు 4445 బాలురు, 4,633 మంది బాలికలు మొత్తం 9078 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. వీటి నిర్వహణకు 48 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉదయం 9.30 నుండి మధ్యాహ్నం 12.30



వరకు పరీక్షలు జరుగుతాయని, విద్యార్థులు ఒక గంట ముందుగా పరీక్షా కేంద్రానికి హాజరుకావాలని అన్నారు. ప్రతి పరీక్షా కేంద్రంలో అవసరమైన మౌళిక వసతులు కల్పించాలని, వేసవి దృష్ట్యా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, ప్రతి కేంద్రం వద్ద వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందుబాటులో ఉంచాలని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద నిరంతర విద్యుత్ సరఫరా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సెంటర్లలో మాస్ కాపీయింగ్, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు పరీక్షా కేంద్రంలోకి అనుమతి లేదని, ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేసి పరీక్ష జరుగుతున్న తీరుపై నిఘా ఉంచాలని, 144 సెక్షన్ అమలు చేయాలని, పరీక్షా కేంద్రాల పరిసరాల్లో జిరాక్స్ సెంటర్లు మూసి వేయించాలని తెలిపారు.

ఖోడద్ పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్



నవతెలంగాణ-తలమడుగు

మండంలోని ఖోడద్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు మంగళవారం నిర్వహించిన ఫుడ్ ఫెస్టివల్ పలువురిని ఆకట్టుకుంది. తెలంగాణ వంటకాలను విద్యార్థులు స్వయంగా తయారు చేసుకుని పాఠశాలలో స్టాళ్లను ఏర్పాటు చేశారు. అతిథులకు టోకన్ల ద్వారా వంటల అమ్మకాలను నిర్వహించి, రుచులను ఆస్వాదింపజేశారు. వ్యాపారంలో ఎలా లాభాలు ఆర్జీస్తారనే విషయాలపై ఫుడ్ ఫెస్టివల్ ద్వారా అవగాహన కల్పించుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జెడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి, ఎంపీడీఓ రమాకాంత్‌లు మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుండే మంచి సంస్కారాలు విద్యాబుద్ధులతో పాటు అన్నింటిలో ఆరితేరి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసి, అన్ని రంగాల్లో రాణించాలని కోరారు. అనంతరం చిన్నారులు వేసిన చిత్ర ప్రదర్శనతో పాటు వండిన వంటకాలు అద్భుతంగా ఉన్నాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కృష్ణకుమారి, గ్రామ సర్పంచ్ సాకి ఆనంద్, విద్యా కమిటీ చైర్మెన్ పురుషోత్తం, ఉప సర్పంచ్ మమత నారాయణరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయలక్ష్మి, వెంకన్న, లక్ష్మి, సుకుమార్ పెట్క్యాలే, ఎస్.సురేఖ, వాసుదేవ్, కిరణ్ కుమార్, సత్యమ్మ విద్యార్థిని, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పుర ప్రజావాణికి 31 అర్జీలు

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

మున్సిపల్ కార్యాలయంలో ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన పుర ప్రజావాణికి మంగళవారం ప్రజల నుంచి అర్జీలు వెల్లువెత్తాయి. మొత్తం 31 అర్జీలు కమిషనర్ ఏ. శైలజ దృష్టికి రాగా అందులో 23 రెవెన్యూకు సంబంధించినవి కాగా, 6 టౌన్ ప్లానింగ్, 1 ఇంజనీరింగ్ విభాగం, 1 సానిటేషన్‌కు సంబంధించినవి ఉన్నాయి. మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ పురవాణికి గైర్హాజరు కావడంతో కమిషనర్ శైలజ అర్జీలను స్వీకరించారు. ఈ సమావేశంలో మున్సిపల్ మేనేజర్ దివాకర్, డీఈ యూనుస్, టీపీఓ అనురాధ, ఆర్ఓ జాదవ్ కృష్ణ, ఆసరా పింఛను అధికారి నస్రత్ అలీ, పుర ప్రజావాణి విభాగ అధికారి పెంటయ్య పాల్గొన్నారు.

బాసరకొచ్చే భక్తులకు మెరుగైన సేవలు

నవతెలంగాణ-బాసర

సరస్వతీ క్షేత్రానికి వచ్చే భక్తులకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర అటవీ పర్యావరణ న్యాయ దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. మంగళవారం సరస్వతీదేవిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో విజయరామారావు, ఆలయ చైర్మన్ శరత్ పాటక్ మంత్రిని ఎమ్మెల్యేను సత్కరించి అమ్మవారి ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో దివిస్ కంపెనీ వారు ఏర్పాటు చేసిన నాలుగు వాటర్ ప్లాంట్లను, ఆన్ లైన్‌లో అమ్మవారి ఆలయ ఈ- హుండీ సేవలను మంత్రి ఎమ్మెల్యే విఠల్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాల్లో దశలవారీగా ఆన్‌లైన్ సేవలను విస్తరిస్తున్నామని, భక్తులకు మెరుగైన సౌకర్యాలను కల్పించడంతో పాటు వారి సౌకర్యార్థం ప్రధాన ఆలయాల్లో ఆన్‌లైన్‌లో పూజలు, వసతి బుకింగ్, ప్రసాదం పంపిణీ తదితర సేవలను అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. ఆన్‌లైన్ సేవల వల్ల అమ్మవారి సేవలను పారదర్శకంగా, సులభంగా పొందగలుగుతారని చెప్పారు. భక్తులకు సేవలు ఆఫ్‌లైన్‌తో పాటు ఆన్‌లైన్‌లో కూడా కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఏప్రిల్ 1 నుంచి బాసరలో ఆన్ లైన్ సేవలు భక్తులకు అందుబాటులోకి వచ్చే విధంగా అధికారుల చర్యలు



తీసుకుంటున్నారని, ఈ-హుండీ సేవలను కూడా భక్తులకు అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. డిజిటల్ కరెన్సీ వినియోగం పెరిగినందున భక్తుల సౌకర్యార్థం ఈ సదుపాయాన్ని కూడా కల్పిస్తున్నామని తెలిపారు. పేటీయం, ఫోన్ పే, జీపే లాంటి యూపీఐల ద్వారా హుండీ కానుకలు చెల్లించవచ్చని మంత్రి పేర్కొన్నారు. అంతకుముందు మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, ఈవో విజయ రామారావు, స్థపతివల్లి నాయగంతో కలిసి ఆలయ పున:నిర్మాణ మ్యాప్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మణరావు, ఎంపీపీ సునీత విశ్వనాథ పటేల్, బీదరెల్లి పిఎసిఎస్ చైర్మన్ వెంకటేష్‌గౌడ్, వైఎస్ ఎంపీపీ నర్సింగ్‌రావు, కిర్గుల్ సర్పంచ్ సుధాకర్‌రెడ్డి, ఎంపీటీసీ ఉమారాణి రమేష్ పాల్గొన్నారు.

నర్సరీల పట్ల జాగ్రత్తలు వహించండి

నవతెలంగాణ-తాండూర్

ఎండాకాలం ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో నర్సరీల పట్ల పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ సూచించారు. మండలంలోని ద్వారకాపూర్ గ్రామపంచాయతీ నర్సరీని మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సరీల్లో షెడ్‌నెట్స్ వేసుకోవాలన్నారు. మొలకెత్తని బ్యాగుల్లో తిరిగి విత్తనాలు నాటాలని చెప్పారు. మొలకల మధ్య పెరిగిన కలుపును ఎప్పటికప్పుడు తీసివేస్తూ మొలకలు ఆరోగ్యంగా పెరిగేటట్టు చూసుకోవాలన్నారు. క్రమం తప్పకుండా రెండు సార్లు నీటిని అందించాలని సూచించారు. మండలంలో అన్ని గ్రామపంచాయతీలలో ఎన్ఆర్ఈజీఎస్ పనులు జరుగుతున్నాయని దినసరి కూలీలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. సరైన పరిమాణంలో కొలతల ప్రకారం పనులు చేసినట్లయితే ప్రభుత్వం నిర్ణయించిన దినసరి వేతనాన్ని పొందవచ్చన్నారు. పంచాయతీ కార్యదర్శులు పారిశుధ్య పనులు పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. ద్వారకాపూర్‌లోని డంపింగ్ యార్డ్‌లో వర్మీ కంపోస్ట్ తయారీ, పొడి చెత్త రికార్డుల నిర్వహణ వంటి పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయనతో ఎంపీఓ సత్యనారాయణ నోడల్ ఆఫీసర్ సదానందం పంచాయతీ కార్యదర్శి సురేష్ కుమార్ సిబ్బంది రాజు, ప్రదిప్ ఉన్నారు.

జ్ఞాన దీక్ష-భీమ్ దీక్ష వాల్ పోస్టర్ల ఆవిష్కరణ

బజార్‌హత్నూర్ : ఈ నెల రోజుల కాలాన్ని అత్యంత పవిత్ర మాసంగా స్వేరోస్ బావించి, భీమ్ దీక్ష చేపట్టనున్నారు. మంగళవారం మండలంలోని కిన్నెరపల్లెలో స్వేరోస్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో భీమ్ దీక్ష వాల్ పోస్టర్లని జిల్లా అధ్యక్షులు కాంబ్లే విజయ్ కుమార్, మోరే అప్పారావ్ చేతుల మీదుగా వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సంధ్భంగా స్వేరోస్ జిల్లా అధ్యక్షులు కాంబ్లే విజయ్ కుమార్ మాట్లాడుతూ అక్షరం, ఆరోగ్యం, ఆర్థికం అనే మూడు లక్ష్యాలతో ముందుకు వెళుతోంది. సామాజిక స్పృహతో, సమాజంలో మార్పు కోసం, విద్యాభివృద్ధికి తోడ్పడుతూ, అందరూ చదవాలి ఎదగాలి అనే నినాదంతో ఏర్పడిన స్వేరోస్ సామాజిక సంస్థ, సామాజిక పరివర్తన కోసం తపన పడిన మహనీయుల జయంతులను పురస్కరించుకొని మార్చి 15 కాన్షిరామ్ జయంతి రోజు నుండి ఏప్రిల్ 14 అంబేద్కర్ జయంతి వరకు జ్ఞానం కోసం భీమ్ దీక్ష చేపట్టడం జరుగుతుందని అన్నారు. వికారాబాద్ జిల్లాలోని పరిగి పట్టణంలో నిర్వహిస్తున్న భీమ్ దీక్ష ప్రారంభ సభకు జిల్లాకు చెందిన స్వేరోస్, అనుబంధ సంఘాలలో పని చేస్తున్న నాయకులు, అంబేద్కర్ వాదులు, బహుజన వాదులు పెద్ద ఎత్తున తరలి వచ్చి విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంబ్లే దత్త, జీవారే దత్త, మోరే అంకుష్, వాగ్మారే దేవిదాష్ పాల్గొన్నారు.

ఘనంగా మరాఠీ మీడియం పాఠశాల వార్షికోత్సవం



నవతెలంగాణ-అదిలాబాద్‌టౌన్

పట్టణంలోని భుక్తాపూర్ ప్రభుత్వ ప్రాథమికోన్నత మరాఠీ మీడియం పాఠశాలలో మంగళవారం వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని అలరించాయి. ఈ కార్యక్రమానికి డీఈఓ ప్రణీత ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పట్టుదలతో కష్టపడి కాకుండా ఇష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. గురువులను, తల్లిదండ్రులను గౌరవించి, వారికి మంచి పేరు తీసుకురావాలని అన్నారు. అనంతరం షీటీమ్ ఏఎస్సై సునీత మహిళలకు, బాలికలకు రక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు. మహిళలు, బాలికలపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టేందుకు షీటీమ్ పనిచేస్తోందని తెలిపారు. ఎవరైనా వేధింపులకు గురిచేస్తే డయల్ 100 నెంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గణేష్ కుమార్, ఉపాధ్యాయులు రితేష్, గోపాల్, కవిత, వైశాలి, రాజశ్రీ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

నస్పూర్ : సింగరేణి కార్మికుల అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలని సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ (బీఎంఎస్) రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. శ్రీరాంపూర్ ఏరియా ఆర్కే-5బి గనిపై ఏరియా ఉపాధ్యక్షులు పెండ్లి మోహన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన గేట్ మీటింగ్‌లో అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ పేరం రమేష్ పాల్గొని మాట్లాడారు. జేబీసీసీఐ 11వ వేతన ఒప్పందం 19 శాతం మినిమమ్ గ్యారంటీ బెనిఫిట్ చారిత్రాత్మకమైన ఒప్పందమని, పూర్తిస్థాయిలో సమావేశం వెంటనే ఏర్పాటు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం చెల్లించవలసిన విద్యుత్తు, బొగ్గు బకాయిలు రూ.25 వేల కోట్లు సింగరేణి సంస్థకు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సింగరేణి సంస్థలో త్వరలో జరగనున్న గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ బీఎంఎస్‌ను గెలిపించాలని కోరారు. భూగర్భ గనులలో రక్షణ చర్యలను విస్మరిస్తున్న సింగరేణి అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని అన్నారు. భూగర్భ గనులలో రక్షణ చర్యలను వెంటిలేషన్ సదుపాయాలు పని స్థలాలను మెరుగుపరచాలని అన్నారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఏరియా కార్యదర్శి నాతాడి శ్రీధర్ రెడ్డి, పిట్ కార్యదర్శి పాగిడి శ్రీకాంత్, నాయకులు బొంపల్లి రమేష్, మేకల స్వామి, కాసవేని సంపత్, కాంపల్లి తిరుపతి, ఆకుల శివకుమార్ పాల్గొన్నారు.

స్వచ్ఛ భారత్ మిషన్ ఫేస్-2 కార్యాచరణ ప్రారంభం

నదిలావర్‌పూర్ : స్వచ్ఛ భారత్ మిషన్ ఫేస్-2 కార్యాచరణ అవగాహన సదస్సును మంగళవారం మండలంలోని కదిలిలో ప్రారంభించారు. గత కొన్ని సంవత్సరాల క్రితం నిర్మించిన మరుగుదొడ్ల పూర్తి వినియోగంపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. విడిపోయిన కుటుంబాలకు అదనంగా మరుగుదొడ్ల నిర్మాణ చేపట్టేందుకు గాను కార్యాచరణ రూపొందించేందుకు నాలుగు సర్వే బృందాలతో సర్వే చేయించినట్లు ఎంపీడీఓ మోహన్ తెలియజేశారు. తడి చెత్త, పొడి చెత్తపై, మిషన్ భగీరథ నీటి సరఫరాలో లోపాలు, లీకేజీల గురించి, సమాచారాన్ని తెలుసుకొని ప్రజలకు వివిధ సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ముచ్చిండ్ల సరిత రాజు, ఎంపీఓ అజీజ్ ఖాన్, ఏఓ శ్రవంతి, ఎపీఓ దివ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కే.ప్రసన్న కుమారి, సీడీపీఓ నాగమణి, ఏఈఎంబీ రాజశేఖర్, ఎస్బీఎం మధుమిత, మాస్టర్ ట్రైనర్ నవీన్ పాల్గొన్నారు.

మంత్రికి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డికి సన్మానం

నిర్మల్ : భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వర ముక్తేశ్వర దేవాలయం డైరెక్టర్‌గా నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన కొరిపెల్లి దేవేందర్‌రెడ్డి ఇటీవల నియమితులయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి దంపతులను, మంత్రి క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. మంత్రికి మొక్కను బహూకరించి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ కొరిపెల్లి రామేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.